ఆగని ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడులు

- ఇరాన్‌పై మూడో రోజు కొనసాగిన క్షిపణి దాడులు
- ప్రతిఘటిస్తున్న ఇరాన్

5

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 314 | విజయవాడ, సోమవారం 16 జూన్ 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 16 June 2025 | Rs

ఆస్ట్రేలియాలో 'జార్జి ఫ్లాయిడ్' తరహా దారుణం

- భారత సంతతి వ్యక్తి మృతి

5

నిల్వలే కారణమట!

- పొగాకు ధరల పతనంపై కేంద్ర మంత్రి పియూష్ గోయల్
- ఉత్పత్తి తగ్గించాలని సూచన
- అంతకుముందు సిఎంతో భేటీ

కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్‌తో చర్చిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి, అమరావతి బ్యూరో

పొగాకు నిల్వలు పెరగడం వల్లే ఈ ఏడాది ధరలు తగ్గాయని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. అయితే, వ్యాపారుల వద్ద నిల్వలు ఇంకా ఎందుకు ఉన్నాయో మంత్రి చెప్పలేదు. గుంటూరులోని పొగాకు బోర్డులో ఆదివారం సాయంత్రం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి అధికారులతో సమావేశమైనారు. అంతకుముందు అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఆయన సమావేశమైనారు. పొగాకు ధరలతో పాటు వివిధ అంశాలపై వీరు చర్చించారు. అనంతరం జరిగిన పొగాకు బోర్డు అధికారుల సమావేశంలో మాట్లాడుతూ ధరల కోసం పొగాకు రైతులు చేస్తున్న ఆందోళనలపై ఆయన స్పందించారు. గత నాలుగు సంవత్సరాలుగా రైతులకు మంచి ధరలే వచ్చాయని, ఈ ఏడాది వ్యాపారుల వద్ద నిల్వలు అధికంగా ఉండటంతో ఆ పరిస్తితి మారిందని చెప్పారు. పొగాకు ఉత్పత్తిని తగ్గించాలని, దీనిలో భాగంగా సాగు విస్తీర్ణాన్ని మరింత తగ్గించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వర్జీనియా, నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

150 కోట్లు కేటాయించండి : సిఎం విజ్ఞప్తి

అంతకుముందు అమరావతిలో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో పొగాకు కొనుగోళ్లకు 150 కోట్ల రూపాయలు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర మంత్రిని కోరారు. ప్రస్తుత సీజన్‌లో హెచ్‌డి బర్లీ, వైట్ బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు ధరలు తగ్గిపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని సిఎం ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రూ.300కోట్ల వ్యయంతో 20మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించందని చెప్పారు. . కొనుగోళ్ల కోసం రూ.150 కోట్లను టొబాకో బోర్డు ద్వారా వ్యయం చేసేలా చూడాలన్నారు. మ్యాంగో పల్ప్‌పై జిఎస్‌టి 12శాతం నుంచి 5శాతనికి తగ్గించాలని కోరారు. కూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని తగ్గించడం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా సిఎం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఆక్వా ఎగుమతులపై అమెరికా విధించిన సుంకాలతో రాష్ట్రంలోని 8లక్షల ఆక్వా రైతులు నష్టపోతున్నారని కేంద్రమంత్రికి సిఎంచంద్రబాబు తెలిపారు. ఆక్వా ఉత్పత్తులపై అమెరికా విధించిన 27శాతం సుంకాన్ని తగ్గించేలా ఆ దేశ అధికారులతో మాట్లాడాలని కోరారు.

సాగు విస్తీర్ణం పెరిగింది : విలేకరులతో కేంద్ర మంత్రి

టుబాకో బోర్డు సమావేశం ముగిసిన తరువాత గుంటూరులో కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ విలేకరులతో మాట్లాడుతూ గతేడాది కంటే ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో పొగాకు సాగైందని తెలిపారు. మొత్తం 1.60 లక్షల మంది మిగతా 5లో

కుప్పకూలిన ఇంద్రాయణి నది పైన ఉన్న ఇనుప వంతెన

టూరిజం.. టూ 'రిస్క్' ?

పర్యాటక ప్రాంతాల్లో ఒకే రోజు మూడు ప్రమాదాలు

పర్యాటక రంగం నుండి కాసులు పిండుకోవాలన్న తపన తప్ప కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు టూరిస్టుల భద్రత పట్టడం లేదా? పర్యాటక ప్రాంతాల వద్ద కనీస భద్రతా చర్యలు తీసుకోవడంలోనూ ప్రభుత్వాలు విఫలమవుతున్నాయా? ఫలితంగా పర్యాటకం టూరిస్టులకు టూ 'రిస్క్'గా మారుతోందా? ఆదివారం నాడు చోటుచేసుకున్న మూడు సంఘటనలు ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం ఇస్తున్నాయి. కనీస భద్రతా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాల వైఫల్యం సెలవు దినం కావడంతో కుటుంబ సభ్యులతోనూ, స్నేహితులతోనూ కలిసి ఉల్లాసంగా గడపడానికి వచ్చిన పర్యాటకులకు మూడు రాష్ట్రాల్లో తీరని విషాదం మిగిల్చింది!

నదిలో కూలిన వంతెన .. నలుగురు మృతి

32 మంది గల్లంతు

పూణె : మహారాష్ట్రలోని పూణెలో ఇంద్రాయణి నదిపై ఉన్న ఒక వంతెన కూలడంతో నలుగురు మృతి చెందారు. పలువురు గల్లంతయ్యారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలో కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇంద్రాయణి నది ఉధృతంగా పారుతోంది. దీంతో గల్లంతైనవారు ప్రాణాలతో బయట పడటంపై అనుమానాలు నెలకొన్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్న వార్తలు వస్తున్నాయి. సహాయక బృందాలు అతి కష్టంమీద ఆరుగురిని మాత్రమే కాపాడ గలిగాయి. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. నదీ తీరప్రాంతమంతా బంధువుల, సన్నిహితుల ఆర్తనాదాలతో మారుమ్రోగుతోంది.

నిర్లక్ష్యమే కారణం...

ఈ ప్రాంతానికి సెలవు దినాల్లో పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తూ ఉంటారు. నిజానికి ఈనది పైన వంతెన పాతపడిపోయింది. స్థానికంగా రాకపోకలకు ఉపయోగించడం లేదని చెబుతున్నారు. అయితే, దానికి సంబంధించిన ఎటువంటి హెచ్చరిక బోర్డులు అక్కడ లేవు. వంతెన మీదకు పోతున్న పర్యాటకులను వారించే సిబ్బంది కూడా లేరు. అనుకోని ప్రమాదం జరిగితే తక్షణమే స్పందించడానికి ఎటువంటి వ్యవస్థలు అక్కడ లేవు. తాజాగా వేసవి సెలవుల నేపథ్యంలో చివరి ఆదివారం కావడంతో ఈ ప్రాంతానికి పర్యాటకులు పోటెత్తారు. అక్కడున్న పాత ఇనుప వంతెనపై నదీ అందాలను చూద్దామని జనం ఒకేసారి పోటీపడ్డారు. వీరిని క్రమబద్ధీకరించే యంత్రాంగం అక్కడ లేకపోవడంతో వంతెన ఒక్కసారిగా కూలిపోయిందని చెబుతున్నారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా... మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో ఫోన్‌లో ఆరా తీశారు. ఈ ఇనుప వంతెనను 30 ఏళ్ల క్రితం నిర్మించినట్లు స్థానిక ఎమ్మెల్యే ఒకరు వెల్లడించారు. ఇది కేవలం కాలినడక మార్గమేనని, ప్రమాద సమయంలో వంతెనపై దాదాపు వందమంది ఉన్నారని, అందులో అనేకమంది ఒడ్డుకు చేరుకున్నప్పటికీ పలువురు గల్లంతయ్యారని ఆయన చెప్పారు.

హెలికాప్టర్ కూలి ఏడుగురు మృతి

గౌరీకుండ్ : దేశంలో ప్రఖ్యాతి గాంచిన కేదార్‌నాథ్ పర్యాటక క్షేత్రం సమీపంలో మరో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒక చిన్నారి సహా ఏడుగురు పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఆర్యన్ ఏవియేషన్‌కు చెందిన హెలి కాప్టర్ గుప్తకాశీ నుంచి పర్యాటకులను కేదార్‌నాథ్ తీసుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆదివారం ఉదయం హెలికాప్టర్ 5.20 నిమిషాలకు కేదార్ నాథ్ నుంచి పర్యాటకులతో గుప్తకాశీ బయల్దేరిన హెలికాప్టర్ వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో 10 నిమిషాలకే కూలిపోయింది.

తనిఖీలు లేవు...

ఈ ప్రమాదానికి కూడా నిర్లక్ష్యమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. వాస్తవానికి సరైన వాతావరణం లేకపోవడంతో గగనతల పర్యాటకంపై స్థానికంగా నిషేధం విధించారు. ఏవియేషన్ సంస్థలు దానిని పట్టించుకోవడం లేదు. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించే సంస్థలపై చర్యలు తీసుకునే యంత్రాంగం లేకపోవడంతో ఏవియేషన్ సంస్థలు ఆడింది ఆటగా సాగుతోంది. ప్రమాదం జరిగిన తరువాత అన్ని రకాల హెలికాప్టర్ సర్వీసులను నిలిపివేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారు. మే రెండవ తేదీన కేదార్‌నాథ్ గుడిని సందర్శకుల కోసం తెరిచారు. అప్పటి నుండి ఇప్పటివరకు ఐదు హెలికాప్టర్ ప్రమాదాలు జరిగాయి. వరుసగా జరుగుతున్న ప్రమాదాలే నిర్లక్ష్య తీవ్రతకు అద్దం పడుతున్నాయి.

బాసర వద్ద ఐదుగురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరిలో మునిగి ఐదుగురు యువకులు మృతి చెందారు. హైదరాబాద్ నగరంలోని చింతల్ ప్రాంతానికి చెందిన సన్నిహిత కుటుంబాలకు చెందిన వీరంతా ఆదివారం కావడంతో బాసర వచ్చారు. అనూహ్యంగా జరిగిన ఈ సంఘటనతో వారి రోదనలతో ఈ ప్రాంతం మారుమ్రోగింది.

భద్రతా సిబ్బంది లేరు...!

బాసరకు తెలుగురాష్ట్రాలోపాటు పొరుగున ఉన్న రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే సంగతి తెలిసిందే. ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నా గోదావరిలో స్నానాలు నియంత్రించడానికి ఒక వ్యవస్థగాని, కనీస సిబ్బంది గాని లేరు. అక్కడ బోటింగ్ నిర్వహించే యాజమాన్యాలు కనీస భద్రతా చర్యలు పాటించడం లేదు. తాజా ఘటనలో యువకులు ఒడ్డున స్నానం చేయకుండా, నది మధ్యలో దీవిలాగా ఉన్న ప్రాంతానికి బోట్లలో వెళ్లి నదిలోకి దిగారు. బోటింగ్ సిబ్బంది వీరిని వారించే ప్రయత్నం చేయలేదని చెబుతున్నారు. దిగిన కాసేపటికే రాకేష్ (17), వినోద్ (18), రితిక్ (18), భరత్, మదన్ (17) గోదావరి ఉధృతికి కొట్టుకుపోయారు. కళ్లముందే వీరి మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.



ప్రతి రెవెన్యూ గ్రామానికి విఆర్‌ఒ

- విఆర్‌ఒ సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా రేషనలైజేషన్ పేరుతో విఆర్‌ఒ పోస్టులు తగ్గించడం అన్యాయమని, ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక విఆర్‌ఒను కొనసాగించాలని ప్రభుత్వానికి విఆర్‌ఒ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రేషనలైజేషన్‌తో సంబంధం లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా గ్రేడ్-1 విఆర్‌ఒల బదిలీలను వెంటనే చేపట్టాలన్నారు.

గ్రామ సచివాలయం కన్వీనరు, పంచాయతీ కార్యదర్శులు బదిలీలకు అడ్డురాని రేషనలైజేషన్ విఆర్‌ఒ గ్రేడ్-1లకు అడ్డురావడం బాధాకరమన్నారు. డిపార్టుమెంట్ల హెడ్‌ల ప్రమేయం లేకుండా సిబ్బందిని తగ్గిస్తూ జిఎస్‌డబ్ల్యుఎస్ ఉత్తర్వులు జారీ చేయడం దారుణమని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ప్రయివేటీకరణతో
వైద్యవిద్యలో అసమానతలు

జెట్టి శేషారెడ్డి స్మారక సదస్సులో ప్రజారోగ్య నిపుణులు విరించి

ప్రజాశక్తి-నెల్లూరు

వైద్య రంగంలో అసమానతలు తీవ్రంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరించి వైద్య విద్యను ప్రయివేటుకు అప్పగిస్తామని నిస్సిగ్గుగా చెప్పడం దారుణమని ప్రజారోగ్య నిపుణులు డాక్టర్ వి.విరించి అన్నారు. నగరంలోని స్థానిక జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ రామచంద్రారెడ్డి వైద్యశాల, ప్రజారోగ్యవేదిక, జనవిజ్ఞాన వేదిక, యుటిఎఫ్, ఎపి మెడికల్ సేల్స్ రెప్రజెంటెటివ్స్ యూనియన్, ఎపి యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టరు జెట్టి శేషారెడ్డి 17వ స్మారక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 'వైద్య విద్య ప్రయివేటీకరణ - పర్యావసానాలు' అన్న అంశంపై డాక్టర్ విరించి, 'భారత రాజ్యాంగం-పూర్వాపరాలు' అన్న అంశంపై మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ మాట్లాడారు. తొలుత జెట్టి శేషారెడ్డి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విరించి మాట్లాడుతూ... 12 వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రైవేటు వారికి అప్పచెబుతామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తే ఎంతో మంది విద్యార్థులు వైద్యవిద్యకు దూరమవుతారని తెలిపారు. 107,108 జిఒలను తెచ్చి ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సగం సీట్లను ఒక్కొక్క సీటును రూ.12 లక్షలు, రూ.20 లక్షలకు ప్రభుత్వమే అమ్ముకునేందుకు మార్గం సిద్ధం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యతగా ఉండాలి తప్ప ప్రజలే వైద్యం కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉండకూడదన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వి.విరించి

ప్రజాస్వామ్యంపై ముప్పేట దాడి : శర్మ

భారత రాజ్యాంగానికి ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, స్వావలంబన అనేవి ఐదు మూల స్తంభాలు అని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. వాటిపై నేడు ముప్పేట దాడులు జరుగుతున్నాయన్నారు. దేశాన్ని మతం పేరుతో రెండు ముక్కలుగా చీల్చే ప్రయత్నం జరుగుతుందన్నారు. సామాజిక న్యాయం అనే పేరుతో అసమానతలు పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాలు ఉన్నాయని, మన దేశానికి ముఖ్యమైన ఆర్థిక, సాంఘిక, సైన్స్ రంగాల్లో స్వావలంబనలపై పూర్తిగా దెబ్బకొట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. ప్రస్తుత పరిస్థితులను మార్చాలంటే మరొక స్వాతంత్ర్య పోరాటం అవసరమవుతుందన్నారు. ప్రభుత్వరంగ ప్రవేటీకరణ, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ వంటి చర్యలతో మన దేశ స్వావలంబనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దెబ్బతీస్తున్నాయని చెప్పారు. సదస్సుకు అధ్యక్షత వహించిన డాక్టరు బి.రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ఆధునిక వైద్యం అందరికి అందుబాటులో ఉండాలన్నదే డాక్టరు జెట్టి శేషారెడ్డి జీవిత లక్ష్యమన్నారు.

జిల్లాలో ఒక ప్రజా వైద్యుడిగా గుర్తింపు పొందడమే కాకుండా నగరంలో ఐఎంఎ హాల్, రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పాటు చేయడంలో ప్రధాన భూమికను పోషించారన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర నాయకులు జి.శ్రీనివాసులు, డాక్టర్ ఎం.వి.రమణయ్య, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎం.వి.చలపతి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు, మెడికల్ సేల్స్ అండ్ రెప్రజెంటెటివ్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.మధు, డాక్టరు ఉషారాణి, ఎపి యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నరమాల సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పిల్లలెక్కువ ఉన్నవారికి జమకాలేదు

- 'తల్లికి వందనం'పై మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరుగురు కంటే ఎక్కువ పిల్లలున్న తల్లులు, అనాథ శరణాలయాల్లో ఉంటున్న పిల్లలకు తల్లికి వందనం పథకం డబ్బులు ఇంకా జమచేయలేదని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేసిన తరువాతే వారికి నిధులు విడుదలవుతాయని ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. తల్లికి వందనం సూపర్ సక్సెస్ అని, తల్లుల కళ్లలో ఆనందం చూసి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడుపు మంట మూడింతలు పెరిగిందని విమర్శించారు. జగన్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలే అందరూ చేస్తారనుకుంటే ఎలా? అని ప్రశ్నించారు.

నీట్ ర్యాంకర్లకు అభినందనలు

వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ ప్రవేశ అర్హత పరీక్ష (నీట్) యుజి పరీక్షా ఫలితాల్లో టాప్-100లో ర్యాంకులు సాధించిన ఆరుగురు రాష్ట్ర విద్యార్థులకు లోకేష్ ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. 19వ ర్యాంకు సాధించిన డి కార్తీక్ రామ్ కిరీటి, 56వ ర్యాంకు సాధించిన కె మోహితశ్రీరామ్, 59వ ర్యాంకు సాధించిన డి సూర్యచరణ్, 64వ ర్యాంకు సాధించిన పి అవినాష్, 70వ ర్యాంకు సాధించిన వై సమీర్‌కుమార్, 92వ ర్యాంకు సాధించిన టి శివమణిదీప్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. దేశస్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు రాణించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. వైద్య వృత్తి ద్వారా భవిష్యత్‌లో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

మహిళలపై రాళ్లు, చెప్పులు వేస్తారా?

- మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నిరసన తెలిపిన మహిళలపై రాళ్లు, చెప్పులు వేస్తారా? అని వైసిపి నాయకులను సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి పర్యటన అంశంపై టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పొదిలిలో రైతులను జగన్ పరామర్శించడానికి ర్యాలీ చేశారా? లేక విధ్వంసాలు సృష్టించడానికి చేశారా? అనే అనుమానం కలుగుతోందన్నారు. నేర ప్రవృత్తిని ప్రదర్శించడానికి వైసిపి చేసిన ర్యాలీ అని అర్థమవుతోందని విమర్శించారు. ప్రజా ప్రతినిధులు ఎవరైనా రైతులకు న్యాయం చేయాలని, అలా కాకుండా తొక్కి పడేస్తామంటూ బ్యానర్‌లతో వెళ్తారా? అని ప్రశ్నించారు. ఈ ర్యాలీలో అక్కడక్కడ రౌడీలను పెట్టి వారితో రాళ్లు వేయించారని విమర్శించారు. రైతు, రాష్ట్ర ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని, తప్పులుంటే ప్రభుత్వాన్ని నిలదీసి ప్రభుత్వం నుంచి సమాధానం కోసం ప్రయత్నించాలని సూచించారు.

'తల్లికి వందనం'పై అసత్య ప్రచారం : కొమ్మారెడ్డి పట్టాభి

తల్లికి వందనం పథకంపై అసత్య ప్రచారం చేస్తూ వైసిపి నాయకులు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి బిడ్డకు తల్లికి వందనం అమలు చేస్తోందన్నారు. 2019 ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన ప్రకారం ప్రతి బిడ్డకు అమ్మఒడి అమలు చేసినట్లయితే ఏడాదికి రూ.10 వేలకోట్లు చొప్పున ఐదేళ్లకు రూ.50 వేల కోట్లు తల్లుల ఖాతాల్లో వేయాలని అన్నారు. ఐదేళ్ల పాలనలో కేవలం రూ.23,877 కోట్లే ఇచ్చారని, సుమారు రూ.26 వేల కోట్లు తల్లులకు ఎగనామం పెట్టారని చెప్పారు.

పనిగంటల పెంపుపై 19న డిపోల వద్ద ధర్నాలు

- ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో పది గంటల పని విధానం, మహిళలు రాత్రి వేళల్లో పనిచేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 19న అన్ని డిపోల్లో ధర్నాలు, గేట్ మీటింగ్‌లు నిర్వహించాలని ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు గౌరవ అధ్యక్షులు ఎస్.కె.జిలానీబాష, అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య అధ్యక్షతన ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ సమావేశంలో తీర్మానించారు. గుంటూరులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆల్ ఇండియా రోడ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు హాజరయ్యారు. తీర్మానాలను ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి ప్రవేశపెట్టారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 9, 10న తిరుపతిలో నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు పని గంటల పెంచుతూ, మహిళా ఉద్యోగులు కూడా రాత్రివేళల్లో పనిచేసేలా నిర్ణయించడం ద్వారా లేబర్ కోడ్‌ల అమలకు పూనుకుందని విమర్శించారు. దీనికి నిరసనగా రాష్ట్రంలో ఆర్‌టిసి ఉద్యోగులు, కార్మికులు 19న అన్ని డిపోల్లో గేట్ మీటింగ్‌లు, ధర్నాలు జరిపి నిరసన తెలియజేయాలని కోరారు. కండక్టర్ల ఉద్యోగ భద్రతకు సంబంధించి 1/2019 సర్కులర్‌ను యథాతథంగా అమలు చేయాలని, జిఒ 70లోని కార్మిక వ్యతిరేక అంశాలను రద్దు చేయాలని ఈనెల 27న విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేయాలని, ఉద్యోగ కార్మికులకు రావాల్సిన అన్ని రకాల బకాయిలను చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం బకాయిలను ఇవ్వాలని, పిఆర్‌సి ఒప్పందం జరిగే లోపు 30 శాతం ఇంటీరియం రిలీఫ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులు వేయాలని, డ్రైవర్, కండక్టర్, మెకానికల్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ సమస్యలపై ఆందోళనకు సిద్ధం కావాలని ఆర్‌టిసి ఉద్యోగ కార్మికులకు పిలుపునిచ్చారు. సమస్యలపై యాజమాన్యం అన్ని సంఘాలతో చర్చించి, పరిష్కరించాలని కోరారు.

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా..
9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- కార్మిక సంఘాల ఐక్య వేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జులై 9న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రతిఘటన పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. ఈ మేరకు పలు సంఘాలు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశాయి. సుప్రీంకోర్టు ఆదేశానుసారం అసంఘటి తరంగ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశాయి. లేబర్ కోడ్‌ల స్థానంలో తిరిగి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలన్నారు. బడా కార్పొరేట్ కంపెనీలకు లాభాలను దోచి పెట్టేందుకు కార్మిక చట్టాల్లో మార్పులు, పని గంటల పెంపుదల అని కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక వర్గానికి తీవ్ర నష్టదాయకమన్నారు. యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన భావ ప్రకటనా స్వేచ్ఛ, సభలు, సమావేశాలు పెట్టుకునే హక్కు, వాక్ స్వాతంత్ర్యం వంటి చట్టాలను నిర్వీర్యం చేయడం సబబుకాదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడం, కారు చౌకగా బడా కార్పొరేట్ కంపెనీల అధినేతలకు అమ్మకం దుర్మార్గమని కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. కంపెనీలకు లాభాలు, కార్మికులకు వెట్టిచాకిరి మిగిలేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. కార్మికుల హక్కులు, చట్టాలు ఏ ఒక్కరి భిక్ష కాదని, వారి పోరాటాల ఫలితంగా సాధించుకున్నవేనని అన్నారు. వాటిని మార్చే అధికారం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి లేదని, చట్టాల మార్పు రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. వ్యవసాయ రంగంలో నూతన మార్కెట్ పాలసీని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ప్రకటన విడుదల చేసిన వారిలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, వైఎస్ఆర్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు పూనూరి గౌతమ్‌రెడ్డి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పోలారి, ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర అధ్యక్షులు జాస్తి కిశోర్‌బాబు, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్‌బాబు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రామకృష్ణ, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రినాథ్, ఎఐటియుసి డిప్యూటీ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సిఐటియు రాష్ట్ర నాయకులు కె ఉమామహేశ్వరరావు, కె ధనలక్ష్మి ఉన్నారు.

ఎంత ఘోరం..ఎంత ఘోరం..

గాంధీనగర్ : అహ్మదాబాద్ ఘోర విమాన ప్రమాద ఘటనలో సజీవ దహనమైన వారి మృతదేహాలను గుర్తించడం కష్టతరమవుతోంది. శరీరాలు ఛిద్రమైపోవడంతో అవి ఎవరివో తేల్చడం కత్తిమీద సాములా మారింది. ప్రతి శరీర భాగానికి డిఎన్ఎ టెస్టులు చేయాల్సి రావడంతో ఎక్కువ సమయం తీసుకుంటోంది. మరోవైపు మాంసపు ముద్దలు ఇచ్చి.. 'ఇవి మీ వారివే' అని వైద్యులు చెబుతుంటే.. బంధువులు అంగీకరించలేకపోతున్నారు. ఒకట్రెండు ముక్కలు కాకుండా పూర్తి మృతదేహాలను అప్పగిస్తే అంత్యక్రియలైనా గౌరవంగా నిర్వహించుకుంటామంటూ వారు పడుతున్న ఆవేదన గుండెల్ని మెలిపెడుతోంది. డిఎన్ఎ పరీక్షలు నిర్వహిస్తున్న అహ్మదాబాద్‌లోని సివిల్ ఆస్పత్రిలోని శవాగారం వద్ద.. మృతదేహాన్ని తీసుకొచ్చే సంచిలో రెండు తలలు ఉండటం వివాదానికి తావిచ్చింది. అప్రమత్తమైన వైద్యాధికారులు వెంటనే మరోసారి డిఎన్ఎ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. తన కుటుంబ సభ్యుల అవశేషాలన్నీ అప్పగించాలని ఓ వ్యక్తి అధికారులను వేడుకున్నారు. అయితే, అది సాధ్యం కాదని అతి కష్టం మీద ఆయనను అధికారులు ఒప్పించారు. కష్టమని తెలిసినా.. ఆత్మీయులను కోల్పోయిన బాధలో బాధిత కుటుంబీకులు వైద్యులను ప్రాధేయపడుతున్న తీరు కన్నీరు తెప్పిస్తోంది. ఓ వైపు కుటుంబీకులను కోల్పోయామన్న బాధ, మరోవైపు కనీసం వారి మృతదేహాలను కూడా ఇంటికి తీసుకెళ్లలేకపోతున్నామన్న ఆవేదనతో ఆస్పత్రి ఆవరణలో పరిస్థితి హృదయవిదారకంగా మారింది.

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విస్తృత సమావేశానికి హాజరైన కార్యకర్తలు, మాట్లాడుతున్న వి.ఉమామహేశ్వరరావు

తపాలా ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం

- ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ (కృష్ణా జిల్లా)

గ్రామీణ తపాలా ఉద్యోగులను పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులుగా గుర్తించే వరకు పోరాటం చేస్తామని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ గౌరవ సలహాదారు బొల్లి ముంత వెంకటేశ్వరరావు తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం టౌన్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞాన మందిరంలో ఆదివారం జరిగిన యూనియన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా 30 వేల పోస్టల్ కార్యాలయాలు ఉంటే గ్రామీణ ప్రాంతాల్లోనే 25 వేలు పైచిలుకు ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగం చేస్తూ ఎనిమిది గంటలకు మించి అదనంగా వెట్టిచాకిరి చేస్తూ రిటైర్డ్ అయిన తర్వాత పెన్షన్ కూడా తీసుకోలేని దుర్భర పరిస్థితుల్లో గ్రామీణ తపాలా ఉద్యోగులు పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 2.70 లక్షల మంది దేశవ్యాప్తంగా అభద్రతా భావంలో పని చేస్తున్నారన్నారు. అనారోగ్య కారణాల రీత్యా డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు 25 లక్షల వరకు క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉండగా, గ్రామీణ తపాలా ఉద్యోగులకు ఆ సదుపాయం లేకపోవడం విచారకరమన్నారు. తపాలా శాఖలో అన్ని సంఘాలు కలిసి జులై 9న సమ్మెలో పాల్గొనేందుకు సన్నద్ధంగా నోటీసులు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.

రాళ్ల దాడి కుట్రే.. : సుధాకర్‌బాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పొగాకు రైతుల సమస్యలను తెలుసుకునేందుకు పొదిలికి వెళ్లిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్‌పై కుట్ర పూరితంగానే టిడిపి రాళ్లదాడి చేయించిందని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్‌బాబు పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ ఎక్కడకు వెళ్లినా ప్రజల నుంచి వస్తున్న ప్రజాధరణను చూసి ఓర్వలేక టిడిపి ప్రణాళిక ప్రకారం ఇలా దాడులు చేయిస్తోందన్నారు. జగన్ ర్యాలీపై టిడిపి కార్యకర్తలు దాడులు చేస్తున్నట్లు వీడియోలు ఉన్నప్పటికీ వైసిపి కార్యకర్తలపై పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సంక్షేమ పథకాలు కోరుతూ..
23న కలెక్టరేట్ల ఎదుట అంగన్వాడీల ధర్నా

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్వాడీలకూ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెన్షన్ల పంపిణీ విధుల నుంచి మినహాయించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23న అన్ని కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ విస్తృత సమావేశం తీర్మానించింది. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో యూనియన్ విస్తృత స్థాయి సమావేశం అధ్యక్షులు జి బేబిరాణి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. మోడీ అధికారం చేపట్టి 11 ఏళ్లయినా అంగన్వాడీలు సహా ఏ రంగంలోని కార్మికులకూ ఒక్క రూపాయి వేతనం పెంచలేదన్నారు. మరోవైపు కార్పొరేట్‌లకు రూ.15 లక్షల కోట్లు రుణమాఫీని కేంద్ర ప్రభుత్వం చేసిందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసేందుకు లేబర్ కోడ్‌లను తెచ్చిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా జులై 9న అంగన్వాడీలంతా సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం అడుగు జాడల్లోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా 10 గంటలు పని చేయాలని, మహిళలు రాత్రి వేళల్లో పని చేయొచ్చని చట్టాలను సవరించిందన్నారు. అంగన్వాడీలకు 42 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీల ప్రకారం వేతనాలు పెంచాలని, లేకుంటే పోరాటాలు తప్ప మరో మార్గం లేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాలుగేళ్లుగా కార్మికులు పోరాటం చేస్తున్నారని తెలిపారు. అంగన్వాడీలకు తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందన్నారు. డిసెంబరులో జరిగే ఆలిండియా సిఐటియు మహాసభలను విజయవంతం చేసే బాధ్యత అంగన్వాడీలపై ఉందన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. 42 రోజుల సమ్మె పోరాటంలో కొన్ని జిఒలు సాధించుకున్నామని చెప్పారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచకుండా, సంక్షేమ పథకాలను అమలు చేయకుండా యాప్‌లతో పనిభారం పెంచుతున్నారని తెలిపారు. అంగన్వాడీలకు సంబంధం లేని పెన్షన్‌ల పంపిణీ విధులు అప్పగించి అదనపు వేతనం కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో తొలుత, ఇటీవల కాలంలో మృతిచెందిన అంగన్వాడీలకు సంతాపం తెలియజేశారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర నాయకులు ఎన్‌సిహెచ్ సుప్రజ, నాగ శేషు, చంద్రావతి, కృష్ణవేణి, లక్ష్మీదేవి, రాజేశ్వరి, శ్రీదేవి, షేబారాణి తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనంలో ఏడాది కోత

- గతేడాది నిధులు జమ చేయని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తల్లికి వందనం పథకానికి టిడిపి కూటమి ప్రభుత్వం ఒక ఏడాది కోత విధించింది. బడికి వెళ్లే ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. దానిని అధికారంలోకి వచ్చిన ఏడాది తరువాత ప్రభుత్వం అమలు చేస్తోంది. అయితే 2024-25 విద్యా సంవత్సరాన్ని పరిగణనలోకి తీసుకోకుండా 2025-26 విద్యా సంవత్సరానికి మాత్రమే అమలు చేస్తోంది. ఇప్పటికే 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన నిధులను వైసిపి ప్రభుత్వం ఎగ్గొట్టింది. ప్రస్తుతం విద్యాసంవత్సరానికి ముందుగానే అమలు చేస్తున్నామని టిడిపి కూటమి ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు విడుదల చేసింది. ఇలా అయితే గత వైసిపి ప్రభుత్వం లానే కూటమి ప్రభుత్వం కూడా తన పాలనలో నాలుగేళ్లే ఈ పథకాన్ని అమలు చేయనుంది. ఐదేళ్లు అమలు చేయాల్సిన అమ్మఒడి పథకాన్ని నాలుగేళ్లు మాత్రమే అమలు చేశారని గతంలో టిడిపి నేతలు పదేపదే విమర్శలు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా వైసిపి ప్రభుత్వం అమలు నిబంధనలతో పాటు నాలుగేళ్ల విధానాన్ని అమలు చేయనుంది. దీంతో రెండు ప్రభుత్వాలకూ తేడా ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు, కలెక్టర్

కృష్ణా తూర్పు డెల్టా కాల్వలకు నీటి విడుదల

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

కృష్ణా తూర్పు డెల్టా కాల్వలకు ఆదివారం నీరు విడుదల చేశారు. ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, యార్లగడ్డ వెంకట్రావు, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా లక్ష్మీశ కలిసి బటన్ నొక్కి నీటిని విడుదల చేశారు. రైవస్ కాలువకు 700, బందరు కాలువకు 300 మొత్తంగా వెయ్యి క్యూసెక్కుల నీటిని ప్రకాశం బ్యారేజీ నుండి విడుదల చేశారు. అనంతరం బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా కృష్ణా డెల్టాను కాపాడుకుంటూ సరైన సమయంలో, సకాలంలో నీటిని విడుదల చేయడం నిరంతరం జరుగుతుందన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడంతో పాటు ఎరువులు విత్తనాలు సకాలంలో అందించి పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, అన్ని రకాలుగా రైతులను ఆదుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాగు నీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు, కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ వల్లూరి పల్లి గణేశ్, జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ కె నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



'సిందూరం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, ప్రజాసంఘాల నాయకులు

మానవజాతి ఆయుధం 'మార్క్సిజం'

- 'సిందూరం' పుస్తకావిష్కరణ సభలో ప్రసాదమూర్తి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆర్థిక అసమానతలు, దోపిడీ ఉన్నంతకాలం మార్క్సిజం ఉంటుందని, మానవజాతికి మార్క్సిజం ఆయుధమని ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్టు డాక్టర్ బి ప్రసాదమూర్తి అన్నారు. కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌లో ఉన్నం వెంకటేశ్వర్లు - ఉష రాసిన 'సిందూరం' పుస్తకావిష్కరణ సభ సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సభలో ప్రసాదమూర్తి మాట్లాడుతూ మార్క్సిజం అన్నది సైన్స్ అని, తాత్కాలిక అపజయాలు ఉన్నా చివరకు విజేతగా నిలుస్తుందని తెలిపారు. కార్ల్‌మార్క్స్ రాసిన పెట్టుబడిదారి పుస్తకాన్ని సిందూరం పేరుతో కవిత్వంగా మలచడం అరుదైన విషయమని అన్నారు. మార్క్సిజాన్ని వివరించడానికి ప్రపంచ వ్యాప్తంగా వేల గ్రంథాలు ప్రపంచ భాషల్లో వచ్చాయని తెలిపారు. సిందూరం పుస్తకం సరళ భాషలో కూడా పెట్టుబడి గూర్చి రాయవచ్చని నిరూపించారన్నారు. సభాధ్యక్షులు జె.రఘుబాబు మాట్లాడుతూ మార్క్సిజం ప్రజల జీవన విధానాల్ని మరింత మెరుగ్గా మారుస్తుందని తెలిపారు. అసమానతలు, అంతరాలు లేని మరో ప్రపంచమే మార్క్సిజమని అన్నారు. ప్రముఖ కవి వెంకటకృష్ణ మాట్లాడుతూ ఈ పెట్టుబడిదారీ సమాజంలో మార్క్సిజాన్ని సామాన్య జనంలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ మాట్లాడుతూ.. కవులు, కళాకారులు సామాజిక జీవిత సత్యాలను తమ సాహితీ ప్రక్రియలో రాయాలని సూచించారు. సిందూరంలో పెత్తందారీ అవినీతి వ్యవస్థలను, దోపిడీని నిలదీసిందని తెలిపారు. ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తిత్వాన్ని శ్రమైక జీవన సౌందర్యాన్ని పెంపొందించేలా సిందూరం పుస్తకంలో కవిత్వీకరించారని అన్నారు. ప్రజాశక్తి కర్నూలు డెస్క్ ఇన్‌చార్జ్ పానుగంటి చంద్రయ్య మాట్లాడుతూ సిందూరం కవితా సంపుటిలో సరళమైన బాషలో, అర్థవంతమైన పదాల పొందికతో అందరినీ చదివించ దగినదిగా ఉందని చెప్పారు. సభలో సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ మాట్లాడుతూ మార్క్సిజం పునాదులపైన దేశ భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముందుగా మహాకవి శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకొని శ్రీ శ్రీ చిత్రపటానికి పూలమాల వేసి అతిథులు జోహార్లు అర్పించారు. పలువురు కవులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవంలో పాల్గోవాలి : సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ నెల 21న విశాఖపట్నంలో భారీ ఎత్తున నిర్వహించనున్న 11వ ప్రపంచ యోగా దినోత్సవంలో ప్రజలు పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆదివారం పోస్ట్ చేశారు. ఆరోగ్యాన్ని కాపాడుతూ ఆయుష్షును పెంచే యోగా ప్రతి ఒక్కరి జీవన విధానం కావాలని సూచించారు. విశాఖలో నిర్వహించనున్న ప్రపంచ యోగా దినోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీ హాజరు కానున్నారని తెలిపారు. యోగాను జీవితంలో భాగంగా చేసుకుందాం.. ఆరోగ్యంగా జీవిద్దాం.. అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

నేడు మోస్తరు వర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వాయువ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం, ద్రోణి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో కొన్నిచోట్ల సోమవారం తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అక్కడక్కడా ఉరుములతో కూడిన మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

మట్టి గోడ కూలి ఇద్దరు మృతి

ప్రజాశక్తి-గంట్యాడ (విజయనగరం జిల్లా)

చిన్నయ్య (ఫైల్)

పైడితల్లి (ఫైల్)

మట్టి గోడ కూలి ఇద్దరు మృతి చెందిన సంఘటన విజయనగరం జిల్లా గంట్యాడ మండలం రామవరం గ్రామంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రామవరం గ్రామంలో రీసు సూరికి చెందిన పూరిల్లు మట్టిగోడ శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి తడిసి, పడిపోయింది. ఆ మట్టిని తరలించేందుకు ఆదివారం ఉదయం ట్రాక్టర్ పెట్టి, బంధువులతో పనిచేయిస్తున్నారు. మట్టిని తొలగిస్తుండగా అకస్మాత్తుగా కొలుసు పైడితల్లి (45), ఎర్ర చిన్నయ్య (61)పై గోడ కూలింది. ఈ ఘటనలో పైడితల్లి, చిన్నయ అక్కడికక్కడే మృతి చెందారు. గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్‌రంగ ప్రయివేటీకరణ అడ్డుకుంటాం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు
- యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఎన్నికైన నూతన కమిటీ

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ రంగం ఆస్తులను అంబాని, అదానికి అప్పగించటానికి మోడీ ప్రభుత్వం యత్నిస్తోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రయివేటుకు అప్పగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. గుంటూరులో రెండు రోజులపాటు జరిగిన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభ ఆదివారంతో ముగిసింది. ముగింపు సభలో నర్సింగరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ప్రయివేటీకరణ పిచ్చి పట్టిందని, అందుకు రాష్ట్రంలో చంద్రబాబు వంతపాడుతున్నారని విమర్శించారు. దేశంలో విద్యుత్ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ప్రయివేటీకరణ అని అన్నారు. రూ.80 లక్షల కోట్ల విలువైన విద్యుత్ రంగం ఆస్తులను కార్పొరేట్లకు అప్పగించటానికి మోడీ ప్రభుత్వం యత్నిస్తోందని, కేంద్రం ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు సంస్థల ద్వారా అధిక ధరలకు విద్యుత్ కొంటూ, ఆ భారాన్ని ప్రజలపై మోపుతోందని మండిపడ్డారు. మరోవైపు రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకూ కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. విమానయానం ప్రయివేటీకరణ వల్లే ఇటీవల విమాన ప్రమాదాలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల నిర్వీర్యం వంటి విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా జులై 9న జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కోశాధికారి ఎస్.రాజేంద్రన్ మాట్లాడుతూ స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల ప్రమాదంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావటం ద్వారా అడ్డుకోవాలన్నారు. విద్యుత్ సంస్థలో పెద్ద సంఖ్యలో ఉన్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. వచ్చేనెల 9న దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని, జెఎల్ఎం గ్రేడ్-2లకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 22న నెల్లూరులో రాష్ట్ర సదస్సు నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలు విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు పిఆర్‌సి ఎరియర్లు ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని, ఇపిఎఫ్ హయ్యర్ పెన్షన్ ఆప్షన్లు తిరస్కరించిన ఉద్యోగులందరికీ హయ్యర్ పెన్షన్ రికవరీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలను మహాసభ ఆమోదించింది. క్యూబా సంఘీభావ నిధికి మహాసభ ప్రతినిధులు రూ.12610లు అందజేశారు.

యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా సూరిబాబు

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సభ సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డి.సూరిబాబు, పి.సుదర్శన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ట్రెజరర్‌గా ఎల్.రాజు, ఉపాధ్యక్షులుగా సిహెచ్.నాగబ్రహ్మాచారి, వి.సత్యనారాయణ, జివి.శివప్రసాద్, పి.ప్రసాద్, ఆర్.సత్యారావు, జాయింట్ సెక్రటరీలుగా జాకీర్ హుస్సేన్, డి.వెంకటేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, సిహెచ్.వీరాంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కె.కిరణ్‌కుమార్, నాయబ్ రసూలు, పి.శివప్రసాద్‌రెడ్డి, కె.హజరత్తయ్య, మహిళా ప్రతినిధిగా వి.క్రాంతి సహా మొత్తం 39 మందితో నూతన కమిటీ ఎన్నికైంది.

కుంగిన నారాయణపురం వంతెన శ్లాబ్

- భీమవరం-చేబ్రోలు నడుమ నిలిచిన రాకపోకలు

వంతెన శ్లాబుకు రంధ్రం, పెచ్చులూడి బయటకు కన్పిస్తున్న ఊచలు

ప్రజాశక్తి - ఉంగుటూరు (ఏలూరు జిల్లా)

ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఏలూరు ప్రధాన కాల్వపై బ్రిటీష్ పాలకుల కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి ఆదివారం తెల్లవారుజామున శ్లాబ్ కుంగింది. గతంలో ఈ వంతెన పిల్లర్ ఒకటి కుంగింది. అలాగే శ్లాబ్ ఊచలు బయటకు వచ్చి పెచ్చులూడడాన్ని పన్నెండేళ్ల క్రితమే గుర్తించారు. ప్రత్యామ్నాయ వంతెన నిర్మాణం చేపట్టకపోవడం, సుమారు 60 టన్నులకుపైగా లోడుతో వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున వంతెనపై భాగంలోని రోడ్డు కుంగిపోయింది. స్థానికులు వెంటనే అధికారులను అప్రమత్తం చేయడంతో పెనుప్రమాదం తప్పింది. నిడమర్రు సిఐ ఎంవి సుభాష్ పర్యవేక్షణలో చేబ్రోలు, గణపవరం, నిడమర్రు ఎస్ఐలు సూర్యభగవాన్, మణికుమార్, శ్రీను ఆధ్వర్యంలో వాహనాలు నారాయణపురం వంతెనపై రాకపోకలు సాగించకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఉంచి రెడ్ రిబ్బన్లు కట్టించారు. ద్విచక్రవాహనాలు మాత్రమే వెళ్లేలా వంతెనకు ఇరువైపులా మట్టితో అడ్డు వేయించారు. తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి, అశ్వారావుపేట నుంచి, జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల నుంచి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వెళ్లే ఆర్‌టిసి బస్సులు ఇదే వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. భీమవరం తదితర ప్రాంతాల నుంచి ఆక్వా ఉత్పత్తులను ఈశాన్య రాష్ట్రాలైన మిజోరాం, అస్సాంతోపాటు బీహారు, పశ్చిమబెంగాల్, ముంబై తదితర సుదూర ప్రాంతాలకు చేపలు, రొయ్యల రవాణా వాహనాలకు ఈ వంతెన చాలా కీలకం. నిత్యం ఈ వంతెన మీదుగా దాదాపు రోజుకు రెండు వేల నుంచి మూడు వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనిపై ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ త్వరలోనే కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

లారీ-బొలెరో ఢీ

- ఒకరు మృతి -13 మంది కూలీలకు గాయాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. 13 మంది కూలీలు గాయపడ్డారు. ఐషర్, బొలెరో వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల నుంచి మాచర్లకు బయలుదేరిన బొలెరో వాహనం యర్రగొండపాలెం అనకుంట వద్దకు రాగానే దొనకొండ ప్రాంతానికి బొప్పాయి కోతకు వెళ్తున్న ఐషర్ వాహనం ఆదివారం తెల్లవారుజామున ఎదురెదురుగా ఢీకొన్నాయి. లారీ డ్రైవర్ షీలా కుమారస్వామి (40) అక్కడికక్కడే మృతి చెందాడు. చెన్నరాయినిపల్లి, గడ్డమీదపల్లి గ్రామాలకు చెందిన 25 మంది బొప్పాయి కూలీల్లో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జెఇఇ, నీట్ కోచింగ్ సెంటర్లు 10కి పెంపు : మంత్రి డోలా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గురుకులాల్లో జెఇఇ, నీట్ కోచింగ్ సెంటర్ల సంఖ్యను ఈ ఏడాది నుంచి 10కి పెంచినట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. గతంలో ఈ సెంటర్లు 3 మాత్రమే ఉన్నాయని, విద్యార్థుల ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని ఈ సంఖ్య పెంచినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ పరీక్షల్లో 143 మంది గురుకులాల విద్యార్థులు అర్హత సాధించారని, వీరిలో 32 మందికి ఎంబిబిఎస్ సీట్లు దక్కే అవకాశం ఉందని తెలిపారు. నీట్‌లో అర్హత సాధించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాల విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. పేదింటి బిడ్డలు డాక్టర్లు, ఇంజినీర్లు కావాలన్నదే ఈ ప్రభుత్వ ఆశయమన్నారు. విద్యార్థులకు అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. జగన్ నకిలీ మద్యంతో పేదల నుంచి రూ.3 వేలకోట్లు దోపిడీ చేస్తే, సిఎం చంద్రబాబు తల్లికి వందనం పేరుతో విద్యార్థులకు రూ.10 వేల కోట్లు ఇచ్చారని మంత్రి పేర్కొన్నారు.



వైద్య రంగంపై మక్కువతోనే టాప్ ర్యాంక్

- నీట్‌లో తెలుగు రాష్ట్రాల టాపర్ జీవన్ సాయికుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్

నీట్ (యుజి) 2025 ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల నుండి కాకర్ల జీవన్ సాయి కుమార్ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 18 వ ర్యాంకు సాధించి తెలుగోడి సత్తా చాటాడు. వైద్యరంగంపై మక్కువతో చదవడం ద్వారానే ఉత్తమ ర్యాంక్‌ను సాధించానని జీవన్ సాయి కుమార్ తెలిపారు. "చిన్నతనం నుంచే వైద్యరంగమంటే ఇష్టం. దానికి నా తల్లిదండ్రులే ప్రేరణ. బైపిసి తీసుకుని నీట్‌కు సన్నద్ధమయ్యాను. సాధారణంగా నెమ్మదిగా చదివే నేను సగటు విద్యార్థినే అయినప్పటికీ ఆలిండియా ర్యాంకు కోసం అహర్నిశలు కష్టపడ్డాను. అందుకు తగ్గట్టే ఆలిండియా 18 వ ర్యాంకు సాధించాను. లక్ష్యం చేరుకోవడానికి నారాయణ మార్గదర్శిగా నిలిచింది." అని సాయికుమార్ తెలిపారు. " నా చదువంతా హైదరాబాద్‌లోనే జరిగింది. నాన్న ప్రొఫెసర్ గంగాధర నాగకుమార్, అమ్మ నళినీదేవి గృహిణి. 6వ తరగతి నుండి నారాయణ సిఓ స్కూల్స్ చదివాను. 10వ తరగతిలో 90 శాతం, ఇంటర్మీడియట్ మాదాపూర్ నారాయణ కాలేజీలో 98 శాతం మార్కులొచ్చాయి. నీట్‌లో టాప్ ర్యాంక్‌కు నారాయణ పరీక్షా విధానం, మార్కుల విశ్లేషణ, సందేహాల నివృత్తి, మైక్రోషెడ్యూల్, ఎర్రర్ లిస్ట్, రివిజన్ ప్రోగ్రామ్ ఎంతగానో సహాయపడింది." అని సాయి కుమార్ పేర్కొన్నారు.

జెడిలకు ఎడిలుగా ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పరిశ్రమల శాఖలో జాయింట్ డైరెక్టర్లకు, అదనపు డైరెక్టర్లుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జాయింట్ డైరెక్టర్లుగా పనిచేస్తున్న ఎ సుధాకర్, ఎ రామలింగేశ్వరరాజు, ఇ ప్రతాప్, కె సోమశేఖర్ రెడ్డి, ఎం రాజశేఖర్, ఎన్ఎస్ఆర్‌సిఎం ప్రసాద్‌కు అదనపు డైరెక్టర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించేందుకు ప్యానల్ కమిటీ సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించినట్లు పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులపై తదుపరి చర్యలను తీసుకోవాల్సిందిగా పరిశ్రమలశాఖ కమిషనర్‌కు సూచించారు.

డిఎస్సీ ప్రత్యేకం -ఎస్‌ఎ/ఎస్‌జిటి

కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

కరెంట్ అఫైర్స్

భారత రాజ్యాంగం @ 75

భారతదేశ స్వాతంత్ర్యానంతరం భారతీయ విలువలు, ఆదర్శాలకు అనుగుణంగా స్వపరిపాలన జరగాలన్న కోట్లాది భారతీయుల ఆకాంక్షలకు అనుగుణంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించుకొని 1949 నవంబర్ 26 నాడు ఆమోదించుకున్నాం. నాటి నుంచి భారతదేశంలో మూల విలువలు, సామాజిక స్పృహలను 'భారత రాజ్యాంగం' సంరక్షిస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా, ఎప్పటికప్పుడు వ్యవస్థను పటిష్ఠ పరుస్తూ సజీవ పత్రం'గా నిరంతర మార్గదర్శనం చేస్తోన్న భారత రాజ్యాంగం ఆమోదం పొంది 2024 నవంబర్ 26 నాటికి 75 వసంతాలు పూర్తి చేసుకుంది.

'75వ రాజ్యాంగ దినోత్సవం' ప్రత్యేక కార్యక్రమాలు

భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 2024 నవంబర్ 26న ఢిల్లీలోని పార్లమెంటు భవనంలోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్లో 'రాజ్యాంగ దినోత్సవం' ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంటు ఉభయ సభల (లోక్‌సభభ, రాజ్యసభ) సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. రాజ్యాంగ స్ఫూర్తిని అనుసరిస్తూ సామాన్య ప్రజల జీవితాలను మెరుగ్గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేయాల్సిన బాధ్యత కార్యనిర్వాహకవర్గం, శాసననిర్వాహకవర్గం, న్యాయ వ్యవస్థపై ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. ఈ సందర్భంగా మహిళా రిజర్వేషన్లపై చట్టం గురించి రాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాజ్యాంగ రచనలో 15 మంది మహిళలు భాగస్వాములైనట్లు రాష్ట్రపతి గుర్తుచేశారు. రాష్ట్రపతి ప్రసంగం అనంతరం సభ్యులందరితో కలిసి రాజ్యాంగ పీఠిక సామూహిక పఠనం చేశారు. అంతకుముందు రాజ్యాంగానికి సంబంధించిన 'మేకింగ్ ఆఫ్ ది కాన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా అండ్ ఇట్స్ గ్లోరియస్ జర్నీ' పేరుతో రెండు పుస్తకాలను విడుదల చేశారు. రాజ్యాంగం ఆమోదించి 75 వసంతాలకు గుర్తుగా స్మారక నాణేన్ని, పోస్టల్ స్టాంప్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విడుదల చేశారు. మైథిలీ, సంస్కృత భాషల్లో రాజ్యాంగాన్ని విడుదల చేశారు.

రాజ్యాంగంపై వెబ్‌సైట్ : భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం https://constitution 75.com పేరిట వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేసింది.

ఏడాది పొడవునా వేడుకలు : భారత రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ నవంబర్ 26 నుంచి ఏడాది పొడవునా వేడుకలు నిర్వహించనుంది. అందులో భాగంగా నగరాలు, గ్రామాలు, పాఠశాలల్లో రాజ్యాంగ పీఠిక సామూహిక పఠన కార్యక్రమాలు ఏర్పాటు చేయనుంది.

రాజ్యాంగ 75వ వసంతం సందర్భంగా రూ.75 వెండినాణెం : భారత రాజ్యాంగం 75వ వసంతోత్సవం జరుపుకొంటున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రూ.75 వెండి నాణెం విడుదల చేసింది. 35 గ్రాముల బరువుండే ఈ నాణేన్ని 50 శాతం వెండి, 40శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్‌తో రూపొందించారు. నాణెంపైన, కింద 75వ రాజ్యాంగ వసంతోత్సవం అని దేవనాగరి లిపి, ఇంగ్లీష్ ముద్రించారు. అలాగే కుడివైపున రాజ్యాంగం అమల్లోకి వచ్చిన సంవత్సరం 1949, కుడివైపున 76వ వసంతోత్సవం జరుపుకుంటున్న 2024 సంవత్సరం ముద్రించి ఉన్నాయి.

ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాలనూ కూలంకషంగా పరిశీలించిన మీదట మన రాజ్యాంగానికి ముసాయిదా కమిటీ రూపమిచ్చింది. ఇందుకు రెండేళ్ల 11 నెలల 18 రోజుల సమయం పట్టింది. ఆ వ్యవధిలో డ్రాఫ్టింగ్ కమిటీ 11సార్లు సమావేశమై ఎప్పటికప్పుడు చర్చించుకుంటూ 395 ఆర్టికల్స్, 8 షెడ్యూల్స్‌తో ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగానికి తుది రూపునిచ్చింది. డ్రాఫ్టింగ్ కమిటీ సమర్పించిన రాజ్యాంగ ప్రతిని అతి కొద్ది మార్పుచేర్పులతో రాజ్యాంగ పరిషత్ 1949 నవంబర్‌న 26న ఆమోదించింది.

129వ రాజ్యాంగ సవరణ బిల్లు-2024

ఏకకాల ఎన్నికల (జమిలి) నిర్వహణకు 129వ రాజ్యాంగ సవరణ బిల్లు, 2024లో రాజ్యాంగంలోని మూడు (83, 172, 324) ఆర్టికల్స్‌ను సవరించడంతో పాటు కొత్తగా ఆర్టికల్ 82ఏను చేర్చాలని కేంద్ర ప్రభుత్వం బిల్లులో ప్రతిపాదించింది.

సవరణ చేయబోతున్న ఆర్టికల్స్ :

ఆర్టికల్ 83 : ఈ ఆర్టికల్‌లో మళ్లీ ఐదు క్లాజులు ఉన్నాయి. లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఐదేండ్ల కాలపరిమితి ఉంటుందని తొలి క్లాజు పేర్కొంటోంది. ఐదేళ్ల కాలపరిమితితో కొలువుదీరే లోక్‌సభ మధ్యలో రద్దయితే మిగిలిన కాలాన్ని వీగిపోని కాలంగా (అన్ ఎక్స్‌పైర్డ్ టర్మ్) పరిగణించాలని రెండో క్లాజు చెప్తుంది. లోక్ సభ రద్దయిన తర్వాత మధ్యంతర (మిడ్‌టర్మ్) ఎన్నికలతో కొత్త లోక్సభ కొలువుదీరుతుందని మూడో క్లాజు తెలియజేస్తుంది. అలా ఏర్పడిన కొత్త లోక్‌సభ మిగిలిన కాలానికి మాత్రమే ఐదేండ్ల కంటే తక్కువ) ఉంటుందని నాలుగో క్లాజు చెప్తుంది. మధ్యంతర ఎన్నికల ద్వారా కొలువుదీరిన లోక్‌సభ అంతకు ముందు రద్దయిన లోక్‌సభకాలంతో కలిపి మొత్తంగా ఐదేండ్లు పూర్తికాగానే మళ్లీ సాధారణ ఎన్నికలు నిర్వహించాలని ఐదో క్లాజు చెప్తున్నది.

ఆర్టికల్ 172: ఆర్టికల్ 83లోని ఐదు క్లాజులు ఎలాగైతే లోక్‌సభకాలపరిమితికి సంబంధించిన నిబంధనలను వెల్లడించాయో.. ఆర్టికల్ 172 క్లాజులు అసెంబ్లీలకు అలాగే వర్తిస్తాయి. అసెంబ్లీల కాలవ్యవధి అనేది లోక్ సభకు అనుగుణంగానే ఉంటుంది.

ఆర్టికల్ 327 : రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విషయాలు (ఎలక్టోరల్, నియోజకవర్గాల పునర్విభజన వగైరా) పార్లమెంట్ నిర్ణయిస్తుందని ఈ ఆర్టికల్‌లో పేర్కొన్నారు.

ఆర్టికల్ 82 ఏలో తీసుకొచ్చే ఆరు క్లాజులు :

ఆర్టికల్ 82 ఏ(1) : జమిలి బిల్లు ఆమోదం పొందిన తర్వాత సాధారణ ఎన్నికలు జరిగిన తర్వాత కొలువుదీరే తొలి లోక్‌సభలో రాష్ట్రపతి ఈ క్లాజును నోటిఫై చేయాలి. ఆ రోజునే 'అపాయింటెడ్ డే'గా పరిగణించాలి.

ఆర్టికల్ 82 ఏ(2) : అపాయింటెడ్ డే తర్వాత ఏర్పడిన అన్ని రాష్ట్రాల అసెంబ్లీల కాలపరిమితి ఆ లోక్‌సభ కాల పరిమితితోనే ముగుస్తుంది. అంటే అవసరమైతే, అసెంబ్లీల కాల పరిమితిలో కుదింపు జరగొచ్చు. అలాగే లోక్‌సభ కంటే ముందు ఏర్పడిన అసెంబ్లీల కాలపరిమితి లోక్‌సభ కాల పరిమితికి అనుగుణంగా పొడిగింపు కూడా ఉంటుంది.

ఆర్టికల్ 82ఏ (3) : లోక్‌సభకు, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికల సంఘం ఎలక్షన్స్‌ను నిర్వహిస్తుంది.

ఆర్టికల్ 82ఏ (4) : ఈ క్లాజు లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాల ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యం.

ఆర్టికల్ 82ఏ(5) : కొన్ని అనివార్య పరిస్థితులు తలెత్తినప్పుడు లోక్‌సభతో పాటు ఏదైనా అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలను నిర్వహించలేని వెసులుబాటు కేంద్ర ఎన్నికల సంఘం కలిగి ఉంది.

ఆర్టికల్ 82ఏ (6): లోక్‌సభతో కాకుండా కొంత జాప్యంతో ఎన్నికలు జరిగిన అసెంబ్లీ కాలపరిమితి ఆ లోక్‌సభతోనే ముగిసిపోతుంది. పుదుచ్చేరి, ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్లో జమిలి ఎన్నికల కోసం మూడు చట్టాల్లో సవరణలు

మరో 40 ఏళ్లలో ప్రపంచంలోనే అత్యంత జనాభా భారత్‌లోనే...

2025 నాటికి భారతదేశం జనాభా 1.46 బిలియన్ల(146కోట్లు)కు చేరుకుంటుందని, దీంతో భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశంగా కొనసాగుతుందని యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ పేర్కొంది.

భారతదేశంలో సంతానోత్పత్తిరేటు ప్రామాణిక స్థాయికి కంటే తక్కువగా ఉన్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. 2025 ప్రపంచ జనాభా స్థితి నివేదికలో, యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ (UNFPA) 'ద రియల్ ఫెర్టిలిటీ క్రైసిస్" గురించి వివరణ ఇచ్చింది. భారతదేశంలో జననాల రేటు 2.1 కంటే తక్కువగా 1.9కి పడిపోయింది.

- 0-14 ఏళ్ల వారు: మొత్తం జనాభాలో 24 శాతం
- 10-19 ఏళ్ల వారు: 17 శాతం
- 10-24 ఏళ్ల వారు: 26 శాతం
- 15-64 ఏళ్ల వయసు (పని చేసే వయసు): 68 శాతం
  65 ఏళ్ల పైబడిన వృద్ధులు: 7 శాతం (అయుర్దాయం పెరుగుతోందన్న అంచనాలు)

ఆయుర్దాయం అంచనాలు: 2025లో పురుషులకు 71 సంవత్సరాలు, మహిళలకు 74 సంవత్సరాలు

భారతదేశ జనాభా పెరుగుదల:

- 146.39 కోట్ల జనాభాతో భారతదేశం ప్రస్తుతం ఉంది.
- 170 కోట్ల దాకా వచ్చే 40 సంవత్సరాల్లో పెరగనుంది.
- ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్‌లో జననాల రేటు ఎక్కువ
- కేరళ, తమిళనాడు, ఢిల్లీలో జననాల రేటు తక్కువ.
- భారత్‌ను ఐక్యరాజ్యసమితి వేగంగా జనాభా మార్పునకు లోనవుతున్న దేశంగా పేర్కొంది.

జనాభా రెట్టింపు: 79 సంవత్సరాలలో రెట్టింపు అవుతుంది.

- 1960లో భారతదేశం జనాభా 43.6 కోట్లు ఉండేది.
- 1970లో సగటు మహిళ ఐదుగురు పిల్లలు జన్మనిచ్చారు.
- ఇప్పుడు సగటు మహిళ ఇద్దరు పిల్లలకు మాత్రమే జన్మనిస్తున్నారు.
- 2025 నాటికి భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశంగా నిలిచిపోతుంది.

గమనిక

డిఎస్సీ ప్రత్యేకం-ఎస్ఎ, ఎస్‌జిటి పేరుతో 'డిఎస్‌సి-2025' అభ్యర్థుల కోసం ప్రజాశక్తిలో గత నెలరోజులుగా ప్రత్యేక మెటీరియల్‌ను ఇచ్చాం. మీరంతా ఆదరించారు. ఫోన్ ద్వారా కూడా మీ అభిప్రాయాలను తెలియజేసినందుకు అభినందనలు. మిగతా పోటీ పరీక్షలు వచ్చిన సందర్భంలో కూడా ఇదే తరహాగా ఇచ్చే ప్రయత్నం చేస్తాం. ఆదరించినందుకు ధన్యవాదాలు. పరీక్షలు ప్రారంభమై జరుగుతున్నందున ఈరోజుతో ఈ శీర్షికను నిలిపివేస్తున్నాం. గమనించగలరు.

-ఎడిటర్

అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ

సోమవారం 16 జూన్ 2025

"సామాజిక జీవితం లేకపోతే సాహిత్యం అనేదే సాధ్యం కాదు. ఈ సంగతి జ్ఞప్తిలో ఉంచుకుంటే సాహిత్యం ఎందుకు? ఎవరికి? అనే రెండు ప్రశ్నలకూ జవాబు వస్తుంది.

– మహాకవి శ్రీశ్రీ

ఆత్మగౌరవ పతాకం అయ్యంకాళి

సందర్భం

దేశంలోనే అక్షరాస్యతలో మొదటి స్థానంలో ఉన్న కేరళలో ఒకప్పుడు దళితులకు విద్యాలయాల్లో ప్రవేశం లేదు. ఆలయాల్లో ప్రవేశం లేదు. కనీసం స్వేచ్ఛగా రోడ్లపై నడిచే హక్కు లేదు. దళిత స్త్రీలు రొమ్ములను కప్పుకునే అవకాశమే లేదు. ఇలాంటి అమానవీయ అసమాన సమాజంలో పుట్టి, ఆ పరిస్థితులపై పోరాడి, సమాజంలో ఎంతో మార్పు సాధించిన సామాజిక అభియాంత్రికుడు 'మహాత్మ అయ్యంకాళి'.

మహాత్మ అయ్యంకాళి సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసిన గొప్ప శక్తి, విప్లవకారుడు, సంఘ సంస్కర్త, రాజకీయ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు. ట్రావెన్‌కోర్ సంస్థానంలో అణగారిన ప్రజల హక్కుల కోసం, ఆత్మ గౌరవం కోసం పోరాడిన సామాజిక ఉద్యమకారుడు. కుల వ్యవస్థ ద్వారా ఏర్పడిన వివక్ష విధానాలను ఎదిరించి సవాలు చేశాడు. దళితులకు విద్య, భూమి యాజమాన్యం, కార్మిక హక్కుల కోసం ఆనాటి ఆధిపత్య వ్యవస్థలను వ్యతిరేకించాడు. నిర్విరామ కృషి అనంతరం ట్రావెన్‌కోర్ శాసనమండలి 'శ్రీ మూలం పాపులర్ అసెంబ్లీలో' మొదటి దళిత సభ్యుడయ్యాడు. 1863 ఆగస్టు 28న వెంగనూర్లో జన్మించిన అయ్యంకాళి, బాల్యంలోనే ఆధిపత్య వర్గాల నుంచి తీవ్రమైన వివక్షను, అణచివేతను ఎదుర్కొన్న ధీశాలి.

బహిరంగ ప్రభుత్వ రోడ్లపై తమకు కూడా సమానమైన వాటా, స్వేచ్ఛగా నడిచే హక్కు ఉందని అయ్యంకాళి ఎద్దుల బండిపై సాహసోపేతంగా యాత్ర చేసినందుకు ఆయనపై ఆధిపత్య వర్గాలు దాడి చేశాయి. ఎద్దుల బండిని ధ్వంసం చేశారు. అయ్యంకాళి తిరిగి పోరాడి తనను తాను రక్షించుకున్నాడు. ఈ సంఘటన రెండు వర్గాల మధ్య హింసాత్మక రక్తపాతానికి దారితీసింది. ఈ అల్లర్లు దాదాపు ఒక సంవత్సరం పాటు కొనసాగాయి. ట్రావెన్‌కోర్ ప్రభుత్వం పోలీసులకు అనుసంధానంగా సైనిక బలగాలను మోహరించడం ద్వారా అల్లర్లను అణిచివేసేందుకు ప్రయత్నించింది. కానీ అది ఫలించలేదు. బ్రిటీష్ ప్రభుత్వం కూడా జోక్యం చేసుకుని నాయర్లు – దళితుల మధ్య రాజీ కుదిరిన తర్వాత 1894లో అల్లర్లు ముగిశాయి. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మ గౌరవం కోసం నాంది పలికిన ఈ సంఘటన కేరళ చరిత్రలోనే ఒక మూల మలుపు.

మారు మరక్కల్ ఉద్యమం

అయ్యంకాళి కుల వ్యతిరేక సామాజిక ఉద్యమాలే కాకుండా మహిళల హక్కుల కోసం కూడా నిలబడ్డారు. దళిత మహిళలపై అణచివేత పద్ధతులకు వ్యతిరేకంగా పోరాడారు. ఆయన ఉద్యమం యొక్క అత్యంత ముఖ్యమైన విజయాల్లో ఒకటి దళిత స్త్రీలు తమ శరీరపు పై భాగాన్ని (వక్షోజాలను రవికతో) కప్పుకునే హక్కును సాధించటం. 20వ శతాబ్దం ప్రారంభం వరకు దళిత స్త్రీలు వారి తక్కువ స్థితి, దాస్యం యొక్క చిహ్నంగా వారి రొమ్ములపై వస్త్రం కప్పకుండా వదలవలసి వచ్చింది. ఈ అమానవీయ ఆచారాన్ని సవాలు చేస్తూ 'మారు మరక్కల్ సమరం' (రొమ్ములను కప్పే ఉద్యమం) జరిగింది. 1895లో అయ్యంకాళి తన భార్య చెల్లమ్మ, సోదరి కుట్టియమ్మ పై బట్టలు ధరించి బహిరంగ రహదారి గుండా నడిచినప్పుడు నాయర్ల గుంపు వారిపై దాడి చేసి, వారి బట్టలు చింపేసి కొట్టారు. ఈ సంఘటన కూడా ట్రావెన్‌కోర్ అంతటా నిరసనలు, ఘర్షణలకు దారితీసింది. వేలాది మంది దళిత మహిళలు తమ రొమ్ములను కప్పుకోవడంపై నిషేధాన్ని ధిక్కరించారు. ఈ తిరుగుబాటు రెండు దశాబ్దాలకు పైగా కొనసాగింది, ఫలితంగా 1916లో ట్రావెన్‌కోర్ సంస్థానం మహిళలందరూ వారి కులాలతో సంబంధం లేకుండా రొమ్ములకు రవిక దుస్తులు ధరించవచ్చని ఉత్తర్వులు జారీ చేయాల్సి వచ్చింది.

దళిత స్త్రీలను అజ్ఞానం, అణచివేతల నుండి సాధికారత, విముక్తి కోసం విద్య చాలా కీలకమని అయ్యంకాళి గ్రహించారు. దళిత బాలికల కోసం పాఠశాలలను స్థాపించి వారు విద్యని అభ్యసించేలా ప్రోత్సహించాడు. తద్వారా కేరళలో మొదటి దళిత మహిళా గ్రాడ్యుయేట్‌గా తన కుమార్తె కళ్యాణి చరిత్రకెక్కింది. తర్వాత చాలామంది దళిత స్త్రీలు కళ్యాణిని స్ఫూర్తిగా తీసుకున్నారు. అయ్యంకాళి దళిత మహిళల కోసం సామూహిక సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించాడు. అక్కడ వారు తమ మనోవేదనలను, ఆకాంక్షలను, ప్రతిభను వ్యక్తపరిచే వేదికగా తయారు చేశారు.

రాజకీయ పోరాటాలు

అయ్యంకాళి 1905లో సాధు జన పరిపాలన సంఘం (పేదల రక్షణ కోసం సంఘం)ని స్థాపించాడు, తరువాత పులయ మహాసభను (పులయ ఫెడరేషన్)గా పేరు మార్చారు. సంఘం దళితులకు విద్య, ఉపాధి, భూమి, న్యాయ సహాయం అందించడం ద్వారా వారి సామాజిక– ఆర్థిక స్థితిని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. సంఘం ద్వారానే పాఠశాలలను కూడా నిర్వహించారు. అయ్యంకాళి 1910లో శ్రీ మూలం పాపులర్ అసెంబ్లీ (ప్రజాసభ), ట్రావెన్‌కోర్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో మొదటి దళిత సభ్యుడు అయ్యాడు. కౌన్సిల్‌లో దళిత ప్రజలు, స్త్రీల పక్షాన నిలబడి వారి సమస్యలను వినిపించాడు. సార్వత్రిక ఓటు హక్కు, భూ సంస్కరణల కోసం కూడా వాదించాడు.

అంటరానివారికి విద్య

అయ్యంకాళి ఉద్యమానికి ముందు, కేరళలో విద్య చాలా వివక్షతో నిండి ఉండేది. విద్యావ్యవస్థలో బ్రాహ్మణులు, ఉన్నత కులాలవారు ఆధిపత్యం చెలాయించేవారు. పాఠశాలల్లో దళితులకు ప్రవేశం ఉండేది కాదు. అయ్యంకాళి 1904లో తన గ్రామంలో దళితుల కోసం మొదటి పాఠశాలను స్థాపించాడు. అతను ఈ ప్రాంతంలోని ఇతర దళిత పాఠశాలలకు ఆర్థిక, నైతిక సహాయాన్ని అందించాడు. 1907లో సమాన విద్యను పొందాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కూలీల సమ్మెను నిర్వహించాడు. దళితులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు అనుమతిస్తూ 1907లో రాయల్ డిగ్రీ జారీ చేయమని ట్రావెన్‌కోర్ మహారాజుకు విజ్ఞప్తి చేశారు. దళితుల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి అవసరమైన సార్వత్రిక ఓటుహక్కు, భూ సంస్కరణల కోసం వాదించారు. ట్రావెన్‌కోర్ మహారాజా శ్రీ మూలం తిరునాల్ విద్యా సంస్కరణలలో అతనికి సహాయం చేసారు. నాయర్ల కంటే తక్కువగా పరిగణించబడి దళితుల కంటే ఉన్నతంగా పరిగణించబడ్డ ఎజవ కులానికి చెందిన ప్రఖ్యాత కవి, సంఘ సంస్కర్త కుమరన్ అసన్, శ్రీ నారాయణ గురు శిష్యుడు, అతని సామాజిక విద్యా కార్యకలాపాలలో సహాయం చేసేవారు.

ఆలయ ప్రవేశ ప్రకటన

అయ్యంకాళి 1895లో బలరామపురం ఆలయ ప్రవేశానికి దళితుల బృందానికి నాయకత్వం వహించినప్పటి నుంచి ఆలయ ప్రవేశం కోసం ప్రచారం చేశారు. సనాతన పురోహితుల నుండి గట్టి వ్యతిరేకతను ఎదుర్కొన్నాడు. అయినప్పటికీ తన ప్రయత్నాలను కొనసాగించాడు. నారాయణ గురు వంటి సంస్కర్తలు మద్దతుగా నిలిచారు. అనేక ఉద్యమాల ఫలితంగా ట్రావెన్‌కోర్లోని హిందూ దేవాలయాల్లో ప్రవేశంపై నిమ్న కులాల ప్రజలపై ఉన్న నిషేధం నవంబర్ 12, 1936న రద్దయింది. శతాబ్దాల కుల ఆధారిత వివక్ష, అణచివేతకు ముగింపు పలికినందున ఈ ప్రకటన కేరళ చరిత్రలో ఒక మైలురాయిగా పరిగణించవచ్చు. ప్రజలందరూ తమ మత స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని ఆస్వాదించగలిగే సమగ్రమైన సమానత్వ సమాజానికి మార్గం సుగమం చేసింది.

అయ్యంకాళి మార్గంలో ...

అయ్యంకాళి తన 77వ ఏట జూన్ 18, 1941న మరణించారు. అతను కేరళ దాని వెలుపల ఉన్న లక్షలాది దళితులకు సామాజిక న్యాయం, ఆత్మ గౌరవం యొక్క వారసత్వానికి ప్రతీకగా నిలిచాడు. అయ్యంకాళి భారతదేశపు గొప్ప వారసుల్లో ఒకరిగా, దళిత విముక్తికి మార్గదర్శకుడిగా విస్తృతంగా పరిగణించబడ్డాడు. ఆయనను ప్రభుత్వం, పౌర సమాజం అనేక పురస్కారాలతో గౌరవించాయి. భారత ప్రభుత్వం 1980లో అతని చిత్రపటాన్ని కలిగి ఉన్న తపాలా బిళ్ళను విడుదల చేసింది. కేరళ ప్రభుత్వం 2002లో అతని పుట్టినరోజును ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (ఖ+జ) 2012లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న అట్టడుగు విద్యార్థుల కోసం అతని పేరు మీద ఫెలోషిప్ పథకాన్ని ప్రారంభించింది. కేరళ ప్రభుత్వం 2014లో వెంగనూర్‌లో ఆయన విగ్రహాన్ని నెలకొల్పింది. అయ్యంకాళి జీవిత సందేశం దళిత సమాజంలోని అణగారిన వర్గాలను వారి హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడేందుకు ప్రేరేపించాయి. కులరహిత సమానత్వ సమాజం కొరకు కలలు కనే వారందరికీ అయ్యంకాళి గొప్ప స్ఫూర్తి. ఆత్మగౌరవ పతాకం అయ్యంకాళి త్యాగాలను, పోరాటాలను స్మరించుకుని ముందుకెళ్ళాల్సిన అవసరం నేటి సమాజంపై ఎంతైనా ఉంది.

(జూన్ 18న అయ్యంకాళి వర్ధంతి)

– గిడ్డకింద మాణిక్యం, పరిశోధక విద్యార్థి
94921 64107

అలజడి రేపే అందమైన కథలు

పుస్తకం



కొన్ని కథలు చదివి పుస్తకం మూసేక మనలోకంలోకి మనం రావాలనుకున్నా రానివ్వవు ఆ కథల్లోని కొన్ని పాత్రలు ఎదుట నిలబడతాయి, ఎదురు ప్రశ్నలేసి మనసును అశాంతికి గురిచేస్తాయి, మా గురించి ఏమాలోచించేవు? అని నిలదీస్తాయి. ఎక్కడికెళ్ళినా మనవెంటే వస్తాయి. వెంటాడతాయి, వేధిస్తాయి. కొన్ని ప్రేమాస్పదమౌతాయి, కొన్ని వాటి ప్రేమలో పడేలా చేస్తాయి. అలా తన ప్రేమలో పడేసింది తన పల్లెటూరి అమాయకత్వంతో ముకుల. ముకుల కళింగాంధ్ర పల్లెటూరి పిల్ల. బహుశా పలాస ప్రాంతానికి చెందినది కావొచ్చు. ప్రముఖ రచయిత్రి కుప్పిలి పద్మ సృష్టి 'ముకుల'. ఏవూరో కథలో చెప్పకపోయినా 'ఉద్దానం' ప్రాంతానికి చెందిన పిల్ల అనిపిస్తుంది. అలా అనిపించడానికి కారణం కథలో ఒకచోట ముకులను డిస్ట్రబ్ చేసే వాతావరణాన్ని 'రంపంతో జీడిమామిడి చెట్టును కోస్తున్న బరబర చప్పుడు' అని వర్ణించడం. జీడికి ప్రసిద్ధి పలాస కదా. 'చెట్టును రంపంతో కోస్తున్న చప్పుడు అనొచ్చు' కానీ జీడిమామిడి చెట్టు అనడంలోనే ఆ పిల్ల కళింగాంధ్రకొక కొసన గల పల్లెటూరికి చెందినదని చెప్పకనే చెప్పినట్టైంది. దానికి తోడు ముకుల నాన్న చదువు మధ్యలోనే ఆపి ఉద్యమబాట పట్టడం.

ప్రసన్న, సింహాచలం నాయుడు దంపతుల కూతురు ముకుల. సింహాచలం నాయుడు చదువు మధ్యలోనే ఆపి ఉద్యమబాట పట్టి కొన్నాళ్ళ తరువాత బయటకి వచ్చి వ్యవసాయంలో స్థిరపడతాడు. తన కుమార్తె ముకులను బాగా చదివించి ప్రయోజకురాల్ని చెయ్యాలనే తలంపుతో ఆమెను తమకు దగ్గర్లోని కాలేజీలో కాకుండా ఢిల్లీలో హాస్టల్‌లో ఉంచి చదివిస్తుంటాడు. ఢిల్లీలో 'అభయ'పై జరిగిన అఘాయిత్యానికి భయపడి ముకుల చేసిన ఫోన్‌తో కూతురు దగ్గరికి బయల్దేరతాడు నాయుడు. కానీ తుఫాన్ కారణంగా వెళ్ళలేక తిరిగి ఇల్లు చేరుకుంటాడు. అక్కడ ఢిల్లీలో ముకుల తన తోటి మిత్రురాలితో చెప్తుంది : "మానాన్న వస్తాడు. నేనెళ్ళి పోతాను" అని. ఆడపిల్లలపై జరిగే అఘాయిత్యాలకు వ్యతిరేకంగా.. 'అభయ'కు న్యాయం జరగాలని విద్యార్థులు, ప్రొఫెసర్లు, యాక్టివిస్టులు పౌరసమాజం కలిసి నడుస్తూ ఇచ్చే స్లోగన్స్ ఊరేగింపులు, సమావేశాలు మధ్య ముకుల 'ఇంత కలిసికట్టుగా వస్తారా న్యాయం కోసం' అని ఆశ్చర్యపడి 'జస్టిస్ ఫర్ అభయ' అని తన గొంతు కలుపుతుంది. "మమ్మల్ని మేం కాపాడుకోడానికి యెటువంటి స్థలాలూ మిగల్లేదు నాన్నా.. యిప్పటివరకూ జరిగిన పదీ పదిహేను సంఘటనలతో యెక్కడా సేఫ్టీ లేదనే తెలుస్తుంది. ట్రస్ట్ చెయ్యగలిగింది శరీరాన్ని మాత్రమే, శరీరం వొక సరిహద్దు అయినప్పుడు యీ సరిహద్దుకి యెలాటి చోటూ లేదు" అని ఫోన్ చేసిన తండ్రికి సమాధానం చెబుతుంది. "సమాజ కోణాల్ని తనంతట తాను చూడటానికి ప్రయత్నించడం గొప్ప విషయం" అనుకుని ఇంటికి వచ్చేస్తానన్న ముకుల అనవసర యుద్ధాలు అనేకం ఉన్న ప్రపంచంలో మన యుద్ధం మనమే చేయడం నేర్చుకోవాలి' అనే తన మాటను ముకుల నేస్తం స్పందన మాటగా చెప్తుంది రచయిత్రి. ఈ కథకి ప్రాణం లాటిదీమాట. 'శలవులకు వస్తాను కదా' అనడంతో కూతురులో తను కోరుకున్న మార్పుకు ఆశ్చర్యపడతాడు సింహాచలం నాయుడు.

'అమ్మాయిలపై జరిగే దుర్మార్గాలకు ఫలానా అనే చోటు ఉండదని, ఎక్కడైనా ధైర్యంగా సామూహికంగా ఎదుర్కోవడమే అమ్మాయిలు చేయాల్సిన పని' అని అమ్మాయిల్లో ధైర్యాన్ని నింపుతుంది రచయిత్రి. కథ చివరిదాకా తుఫాను ముసురు నేపథ్యంలో నడిచి 'వాన వెలిసిపోతుందనీ, అమ్మాయిల కళ్ళల్లో వెలుగురేకలు విచ్చుకుంటాయనీ' బలమైన నమ్మకంతో ముకుల కథ ముగుస్తుంది. ఎందరో ముకుల లాటి అమ్మాయిల్లో ధైర్యాన్ని నింపే కథ యిది.

కరోనా కాలం ప్రజాజీవనంలో ఎంత విషాదం నింపిందో, మరీ ముఖ్యంగా బతుకు తెరువుకై పట్నాలకు వలస వెళ్ళిన ఆడపిల్లలు కోవిడ్19 సందర్భంగా ఎదుర్కొన్న సమస్యల్ని రికార్డు చేసింది రచయిత్రి ఈ సంపుటిలోని ఐదు కథల్లో. 'ఆ పాదాలు చితికిన ఆశల్లా ఉన్నాయి, ఆపాదాలు చిదిమేసిన ఆశల్లా ఉన్నాయి' అని నగరాల నుండి స్వగ్రామాలకు నడిచి వెళ్ళే అభాగ్య జీవుల వేదనకు అద్దం పట్టింది "మళ్ళీ తేయాకు తోటల్లోకి" కథ. ప్రతి యేడాది తేయాకు చెట్టుని నరికి మరుగుజ్జును చేస్తున్నట్టుగా యికపై యిక్కడి జీవితాలు యేమాత్రము కుదించబడకూడదు' అని కమ్లని కోసం నీలాక్షి చేసిన మానవీయమైన ఉదాత్తగుణం మనలోనూ ఉండాలని ఆశిస్తుంది. దుర్భరమైన బతుకు బాధల్లో, అసలైన జీవన మాధుర్యం కోల్పోవడంలోని వేదనను పరిమళ ద్వారా మనకు అనుభూతం చేస్తుంది 'పరిమళ కలలది యే పరిమళం?' కథలో. పేరు పరిమళ, తను చేసే పని మన బతుకుల్ని పరిమళభరితం గావించే అగరొత్తులు తయారు చేయడం. కానీ ఆమె కాలిపోయిన కలలకు పరిమళం లేదంటుంది. పరిస్థితుల ప్రభావానికి తలవొగ్గి ఆర్థిక సంక్షోభంలో నమ్మిన విలువలకు దూరం కావడంలోని బాధని "ఇంద్రధనుస్సు చేజార్చుకున్న రంగుల్లో..." కథలో చదివినప్పుడు 'సంజనా'.. వేదన చదువరి హృదయాన్ని పిడికిట్లో పట్టి మెలితిప్పినట్టనిపిస్తుంది

నిజానికి ఈ సంపుటిలోని కథలన్నీ "ఏ శిశిరమూ చెప్పని ఊపిరి ఉనికి" కథలే. కరోనా కాలపు అలజడి, అల్లకల్లోలాల్ని కళాత్మకంగా, కవితాత్మకంగా అక్షరబద్ధం చేసి "మనిషిని మించిన ఆక్సిజన్ లేదు, యెప్పటికైనా మనిషి స్పర్శే ప్రాణవాయువు" అని నిర్ధారణ చేయడం రచయిత్రిగా పద్మ పరిణితికి నిదర్శనం. ఇక హృదయాల్ని మెలిపెట్టే కథ "మణిపూర్ ఎక్స్" నిరంతరమూ నిరంతరాయంగా సమాజంలో జరిగిన, జరుగుతున్న యే యుద్ధాలకైనా బలయ్యేది మహిళలే. ఈ కథలో ప్రధాన పాత్రకు పేరు లేదు.. ఎక్స్ అంతే! మణిపూర్ విధ్వంసకాండకు, అక్కడ మెయితీ కుకీ తెగల మధ్య యుద్ధాలకు, రాజకీయ జాతి, మత విద్వేషాల వికృత క్రీడల దుశ్చర్యల తీవ్రతకు పరాకాష్ట అనదగిన సందర్భాన్ని కథగా చదువుతుంటే 'ఎంత నిస్సిగ్గుగా బతికేస్తున్నామో ఈ సమాజంలో' అని మనపై మనకే అసహ్యం కలుగుతుంది.

ఈ కథలన్నిటా మహిళలు తమలో తాము, తమతో తాము, సమాజంతో తాము చేసే పోరాటాల ప్రతిఫలనాలు హృదయాల్ని పట్టి కుదుపుతాయి. ఈ కథల్లోని ప్రత్యేకత ఏ పాత్రా తనకు జరిగిన అన్యాయానికి సినిమాల్లోలా ప్రతీకారం తీర్చుకోడానికి ప్రయత్నించకపోవడం. అలా చేసివుంటే అత్యంత పేలవమైన కథలుగా మిగిలిపోయేవి. పద్మ పరిణితి కథకురాలిగా ఒక మెట్టు పైనే ఉందనడానికి ఈ కథలు ఉదాహరణలుగా నిలుస్తాయి. ఈ కథల్లోని ఏ పాత్రనూ ఒకంతట మరిచిపోలేం. ముకుల, కమ్లిని, సంజనా.. ఒకరేమిటి అందరూ మనల్ని ప్రశ్నిస్తూనే ఉంటారు. 12 కథలున్న ఈ సంపుటిలో చాలా కథల్లో నగరాల్లో నిలదొక్కుకోడానికి అమ్మాయిలు పడే యాతన, ఇబ్బందులు, వాటిని అధిగమించడానికి వాళ్ళు చేసే ప్రయత్నాలు పాఠకుల్ని ఆలోచనల్లో పడేస్తాయి. అలజడి రేపుతాయి. ఇంత మంచి కథల్ని అందించిన 'కుప్పిలి పద్మ'ను అభినందించకుండా ఉండడం సాధ్యం కాదు. ముక్త పబ్లికేషన్స్ ప్రచురణగా వొచ్చిన ఈ కథల పుస్తకం సాహిత్యాభిమానులు, ముఖ్యంగా అమ్మాయిలు తప్పక చదవాలి. రూ.250 వెల గల ఈ పుస్తకం కోసం 040 2465 2387 నెంబర్లో సంప్రదించొచ్చు.

– గంటేడ గౌరునాయుడు



మృత్యు ముఖాలు!

ఆనందంగా ఉండొద్దని చెప్పండి
ఎవరి సంతోషమో ఇంకెవరికో
శాపం కాబోతోందని రాయండి..
కడుపు నిండా బువ్వ తినొద్దని చెప్పండి
అది అరిగేలోపే ప్రాణం కూడా
పోవచ్చని హెచ్చరించండి...

రేపటి కలలు కనొద్దని చెప్పండి
కల కూడా ఎక్కడ కాటేస్తుందో
అని నిద్రను కూడా
మందులేసి ఆపండి ...

కౌగిలింతలు, ముద్దులు,
చూపుల మధ్య దగ్గర కావొద్దని చెప్పండి
ఈ ప్రేమలకు ఏ క్షణాన నూకలు
చెల్లిపోతాయోనని బుద్ధి చెప్పండి...

పసిపిల్లలను నవ్వకుండా
నోరు కట్టేయండి....
ఆ నవ్వులు ఛాయాచిత్రాల్లో
తప్ప నిజంలో బతకవని చెప్పండి...

ఎందుకంటే
ఇప్పుడు మరణం ప్రతి ఇంటి మీద
జెండాలా ఎగురుతోంది...
మృత్యువును తొడుక్కున్న
మనుషులే సమాజంలో తిరుగుతున్నారు...

కొన్ని సంతోషాలు
తుపాకీలకు బలవుతుంటే
ఇంకొన్ని విమానాల
పాలవుతున్నాయి...
కనిపించే దేవుళ్ళ తొక్కిసలాటలో
ప్రేమ నలిగిపోతోంది!

జీవితం అంటే
ఒక చెంపను చల్లని పిల్లగాలి
తాకడం లాంటిదైతే
మరో చెంపను 50 డిగ్రీల ఎండ
కరకరా నమిలి మింగేయడం లాంటిది!

ఎవ్వరైనా ఒక్కసారి చెప్పొచ్చుగా
ఓ మృత్యువా రేపు రా అని
ఇప్పుడిప్పుడే కొన్ని
లేలేత కొమ్మలు, బొమ్మలు
పురుడు పోసుకుంటున్నాయని!

– అమూల్యచందు, 90598 24800

ఒక చిరునవ్వు మెరిసిన చోట

పాప వెళ్ళిన దారిలో
వాడి,రాలిపోయిన చిరునవ్వులు–

శబ్దం చేయని చప్పుళ్ళు
తలుపు దగ్గర దోబూచులాటలు–
నా గుండెపై
పాప వదిలిన పాదముద్రలు
నాలుగు గోడల మధ్య
గొంతు పెగలని మాటల పెనుగులాటలు
ఇంకా కలలు కంటున్నాయి

అరచేతిలో సేదదీరే నీడలతో
దిగులు రాత్రులు కొన్ని
శ్వాసగా మారాయి
ఒక నిట్టూర్పు దూరంలో నిలిచిన
ఆ లేత స్పర్శతో సహా
ఒక చిరునవ్వు మెరిసిన చోట
ఒక నిశ్శబ్ద పరిమళ భరితమై
గులాబీ పువ్వై వికసిస్తుంది కదూ!

తరగతి గది కిటికీలోంచి
పాప ఎదురుచూపులు
నిమిషాలను నిశ్శబ్దాలను భంగపరుస్తూ–
నా దేహపు వాకిలిని అప్రమత్తం చేస్తున్నాయి
తను వెళ్లిన దారినే చూస్తూ
నా కనురెప్పలు ఇంకా మూతపడలేదు

పాప అడుగుల సవ్వడి
కనుమరుగయ్యాక
నా ప్రతి ఆలోచన ఒక కవితై
తడిపి తనివి తీరుస్తోంది!

ప్రతి దూరమూ వేదనా కాదు
ప్రతి జ్ఞాపకమూ ఒంటరిదీ కాదు!

– విల్సన్ రావు కొమ్మవరపు, 89854 35515

అతడు మరణించలేదు

పునరాగమనం కోసం
పునరుజ్జీవనం కోసం
అంతర్దర్శనం కోసం
మాటలు, జ్ఞాపకాలు ఎదురుచూస్తాయి.

ఎటు చూసినా –
రెక్కల కలతలు
కలల కలతల ప్రకటనలే...
ఏమీ చాలదంటారా?
సమూహాలకు కరచాలనాల
టీ సమయాలు చాలవూ?!

• • •

మరణాలన్నీ మరణాలు కావంటూ
మహారణ్యాలన్నీ ముందున్నాయి.
విత్తనాలయినా
ముందు పాతిపెట్టబడతాయి.

మనిషి నెత్తురును
భూమిపై
ఎక్కడా ఎవరూ
దాచి పెట్టలేరు!

– పలమనేరు బాలాజీ, 94409 95010

నా దేశంలో ...

వారనుకున్నదే నువ్వు అనుకుంటావని
నా దేశంలో
నిన్ను చెరసాలలో వేస్తారు
ఒకసారి మా మామయ్య నాతో అన్నాడు
"మన మెదడులో ఒక మైక్రోచిప్ వాళ్లు నాటిస్తారు
మన ఆలోచనల్ని, కలల్ని
జాన్ వోస్టర్ కూడలి తెర మీద ప్రసారం చేయించడానికి."

నేను భయపడి
పగటి పూట నా నాలుకను కాపాడుకుంటూనే ఉన్నాను,
రాత్రి పూట నా కలల్ని ...

– పిటికా ఎంటులి (1942)
దక్షిణాఫ్రికా కవి, శిల్పి, ఉద్యమకారుడు

ఆంగ్లం నుంచి అనువాదం : ముకుంద రామారావు
990 834 7273

చిరుదివ్వె వెలిగిద్దాం!

భూమి పొరల్లో పూడుకుపోయిన
అస్తిపంజరాల కథలు వినాలంటావా
చెవులు కాదు, చదివే మనసు కావాలి.
ఆకాశం శూన్య శరీరం మీద
మచ్చల చరిత్ర మహాగ్రంథం రాయాలంటే
చేతులు కాదు, రాసే అక్షరాలు కావాలి.

చీకటి సముద్రాన్నెంత తోడిపోసినా
చీకటే మిగులుతుంది చివరికి..
అజ్ఞానం గుట్టలుగా పోసినట్టు.
గతం, వర్తమానం, భవిష్యత్తూ
త్రిముఖ కోణాలై చీకటి కళ్ళు తెరుస్తాయి.
నీకు నీవే కాదు
ఎదుటివాడు కూడా చీకటి గుడారమే.
జటా ఝుళిత నృత్యాంగనైన చీకటి రాక్షసిని
ఒక్క కిరణంతో చంపగలగాలి
దీపం వెలిగించు అక్షరంతో
నువ్వు ఒక పుస్తకమైపోతావు
చీకటి పాలపుంతై పోతుంది.
అనుభవాల యిరుసు మోసే చక్రాలు రెండు
భూత భవిష్యత్తులైపోతాయి
మనసు ప్రపంచ చరిత్రను చదువుతూ
పంచభూతాల్లో అస్తిత్వాన్ని రచిస్తుంది.

బతుకు పడవకి చుక్కాని చదువు
రేపటి కోసం నీ జ్ఞాపకాల సూర్యుణి
భూమ్మీదకి విసిరెయ్
కొత్త ఆశలకు అంటూ కడతారు జనం.
అతీతం నుంచి అణువు వరకూ
అంతరాంతర విచ్ఛేదనం చేసి
మనిషిని చూసే కళ్ళని ఆవిష్కరించింది
నీకు తెలుసో తెలియదో
అణుబాంబుకు ఆత్మ అక్షరం.
అన్వేషణకి ఆది అక్షరమే.
చదివితేనే బ్రతికి పోతావని కాదు
బతుకు పదానికి చదువు డిక్షనరీ.
రాళ్లతో యుద్ధాలు చేసిన వాడే
రాకెట్లతో దాడి చేస్తున్నాడు.
వాతలతో వ్యాధుల్ని పీడించిన వాడు
ట్యూబుల్లో వీర్య శిశువులకి
పాలుపడుతున్నాడు
డప్పులతో వంశ చరిత్రలు చెప్పిన వారిలా
టీవీలో వార్తలు చదువుతున్నాడు
పల్లకీల్లో ప్రయాణం మానుకొని
వాయువిహంగాల్లో ఎగురుతున్నాడు
కాడి భుజాన పెట్టుకొని
మట్టి దున్నుకున్న కాళ్లతో
ఆకాశ నృత్యం చేస్తున్నాడు.
నిన్ను నీవు అజ్ఞాన శవం
ఖననం చేసిన గుట్టమీద
నేడు మంకెన పూల తివాచీ
ఇప్పుడు సూర్యుడు సమ్మె చేసినా
కాలం మన మణికట్టు మీద నడుస్తుంది

సముద్రాల్లో భూగోళం మునిగిపోని నిజం
ఒక్క విద్యకే తెలుసునేమో
రక్తం రంగు అందరికీ ఎరుపే
అందులో పీఠం వేసిన రోగాలే వేరు వేరు
కంటిపాపలు కలల జోల పాడినట్టే
కన్నీటి కథలూ ఉప్పు పాతరేసుకుంటాయి
అక్షరాల వలపన్నిన హృదయం
కలల్నీ కతల్నీ బంధించేస్తుంది
పదాల బోనులో..
పెదవులపైని పాటకు
రాగాల నగిషీలు తొడుగుతుంది .
మనిషినే మహాశిలని
శిల్పంగా చెక్కుతుంది అక్షరం
కళ్ళుండీ చూడలేని దృష్టికి
పుటాకారమై పోతుంది అక్షరం
సూర్యుడిలాగే చంద్రుడూ గోళమే
అయినా ఒకరు నిప్పులు చెరిగితే
మరొకరెందుకు మంచు కురుస్తారు?
మిస్టరీకి క్లూ హిస్టరీయే విప్పుతుంది
విద్యకే కదా బుద్ధి వికసిస్తుంది.
విత్తులు నాటింది నేలలోనైనా
మొక్కెందుకు పైకి లేస్తుంది
భూమ్యాకర్షణ ఏమవుతుంది?
ఆకాశాన్ని అడిగితే బదులిస్తుందా?
చదువులేమి ముడి విప్పుతుందా?
గర్భంలో ఎదిగే పిండానికి
మోసే పేగు తిండి పెడుతుంది.
గర్భం దాటి వచ్చే పక్షి గుడ్డుకి
ఆహారం ఎలా లభిస్తుంది?
పరిశోధనలో నిగ్గు తేలుతుంది
అక్షరమే శోధనకు పదును పెడుతుంది.
వెంట్రుకలు వెండి రంగు పూసుకుంటేనేం
ముఖం అనుభవాల ముడతలు ధరిస్తేనేం
నీ బతుకింట్లో చీకటి చితికోసమైనా
అక్షరాల్ని అరణి పట్టు.
ఒక్క చిరు దివ్వె వెలిగించు!

– ఈతకోట సుబ్బారావు
94405 29785

సమాధానం చెప్పగలరా?

ఓ వ్యవస్థలో నైపుణ్యం
ఏదో లోపంతో కుప్ప కూలినప్పుడు
మట్టిలో కలసిన పరువుతో
ప్రభుత్వంలో కదలిక వస్తుంది!

ప్రాణం పోతేనే
వ్యవస్థలు మేల్కొనేది
దేశం కన్నీరు పెడితేనే
నాయకులు ఆలోచన పదునెక్కేది!

ఇంత పెద్ద తప్పిదం వెనుక
సాంకేతికత మసిగా మారి
బలైన జీవితాలకు
ఏ పరిహారంతో బొట్టు కన్నీటికి
సమాధానం చెప్పగలరా ఎవరైనా?

– చందలూరి నారాయణరావు
97044 37247

భారత ఆర్థిక వ్యవస్థపై పెను భారం

- ద్రవ్యోల్బణం, వాణిజ్యం పైనా ప్రభావం
- తప్పని చమురు ధరల మంటలు
- పశ్చిమాసియా ఘర్షణలపై నిపుణుల హెచ్చరిక

న్యూఢిల్లీ : ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య కొనసాగుతున్న ఘర్షణలు భారత ఆర్థిక వ్యవస్థ, ద్రవ్యోల్బణం, వాణిజ్యంపై ప్రభావం చూపబోతున్నాయి. చమురు ధరలు ఆకాశాన్ని తాకుతాయని నిపుణులు హెచ్చరించారు. అంతర్జాతీయ వాణిజ్యం స్థిరంగా ఉన్న సమయంలో, ఎర్ర సముద్రంలో నౌకల రాకపోకలు సాధారణ స్థాయికి చేరుకున్న వేళ పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఫలితంగా వాణిజ్య కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుందని, చమురు ధరలు భగ్గుమంటాయని ఆందోళన వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న ఆందోళన కారణంగా సెన్సెక్స్ 573 పాయింట్లు పతనమైంది. హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయవచ్చునని నిపుణులు చెబుతున్నారు. ఈ జలసంధి మీదుగానే ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుండి 20 నుండి 25 శాతం అంతర్జాతీయ చమురు, కీలకమైన ఎల్‌ఎన్‌జీ రవాణా జరుగుతోంది. మన ఇంధన అవసరాలకు ఈ రెండూ ముఖ్యమైనవే.

అస్థిరత తప్పదు

ఇజ్రాయిల్-ఇరాన్ ఘర్షణల కారణంగా అస్థిరత నెలకొనే ప్రమాదం కూడా ఉంది. రాబోయే నెలలలో ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అంతేకాదు...దేశానికి స్థూల ఆర్థిక సవాళ్లు కూడా ఎదురవుతాయి. చమురు దిగుమతులపై భారత్ ఎక్కువగా ఆధారపడుతున్నందున ఈ పరిస్థితి తప్పకపోవచ్చు. బ్యారల్ ముడిచమురు ధర పది డాలర్లు పెరిగితే మన వాస్తవ జీడీపీ వృద్ధి 0.3 శాతం పాయింట్లు తగ్గిపోతుంది. అలాగే వినియోగ ద్రవ్యోల్బణం 0.4 పాయింట్లు పెరుగుతుంది. 75 నెలల కనిష్ట స్థాయి నుండి ద్రవ్యోల్బణం కొంతమేర కోలుకొని మేలో 2.82 శాతానికి చేరింది. దీంతో ఆర్‌బీఐ రెపో రేటును 50 బేసిక్ పాయింట్లు తగ్గించింది. ద్రవ్యోల్బణ పరిస్థితుల నుండి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న పరిస్థితులలో ఇరాన్-ఇజ్రాయిల్ ఘర్షణల కారణంగా మళ్లీ ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం కన్పిస్తోంది. చమురు ధరలు పెరిగితే మన రిఫైనింగ్ కంపెనీలు ముడి చమురును కొనుగోలు చేయడానికి ఎక్కువ డాలర్లు వెచ్చించాల్సి వస్తుంది. దీంతో డాలర్ డిమాండ్ పెరుగుతుంది. రూపాయి బలహీనపడుతుంది. దిగుమతి వ్యయం పెరుగుతుంది. ఈ పరిణామాల ఫలితంగా భారత ప్రస్తుత కరెంట్ అకౌంట్ లోటు పరిస్థితి దారుణంగా మారుతుంది.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు దెబ్బే

ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్, ఇజ్రాయిల్ దేశాలు ఇప్పటి వరకూ నేరుగా దాడులు చేయలేదు. అయితే ఆ ప్రమాదం కూడా పొంచి ఉంది. తన రిఫైనరీలకు ఎలాంటి నష్టం కలగలేదని ఇరాన్ తెలిపింది. ఇరాన్ రిఫైనరీలు రోజుకు 2.8 మిలియన్ బ్యారల్స్ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. అయితే దాని ముడి చమురు ఎగుమతులు రోజుకు 1.5 మిలియన్ బ్యారల్స్ కంటే తక్కువకు పడిపోయే అవకాశం ఉంది. దీనివల్ల ప్రపంచ ఇంధన మార్కెట్లలో మరింత అస్థిరత నెలకొంటుంది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఘర్షణలతో ముడి చమురు ధరలు మాత్రమే కాకుండా భారత్ దిగుమతి చేసుకునే ఎల్పీజీ, సహజ వాయువు, పెట్రోకెమికల్స్, ఎరువుల ధరలు కూడా పెరుగుతాయి. వీటి సరఫరాలో అడ్డంకులు ఏర్పడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతుంది. ఎరువుల ధరలు పెరిగితే ఆహార ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది.

లాభాలలో కోత

ఎరువులు, ఎల్పీజీ ధరలు పెరిగిన పక్షంలో గ్రామీణ కుటుంబాలపై భారం పడుతుంది. వ్యవసాయోత్పత్తి పడిపోతుంది. ఆహార ధరల స్థిరత్వం విషయంలో ఇటీవల సాధించిన సత్ఫలితాలు కనుమరుగై ద్రవ్యోల్బణం పైకి ఎగబాకుతుంది. విమానయానం, రసాయనాలు, రంగులు, టైర్లు, సిమెంట్, లాజిస్టిక్స్ వంటి కీలక రంగాలు ఎక్కువగా పెట్రోలియం ఆధారిత ఇన్‌పుట్స్‌పై ఆధారపడతాయి. ముడి పదార్థాల ఖర్చులు పెరిగితే ఈ రంగాల లాభాల మార్జిన్లు తగ్గిపోతాయి. చమురుపై ఆధారపడడాన్ని బట్టి వివిధ రంగాలపై ప్రభావం భిన్నంగా ఉంటుందని క్రిసిల్ రేటింగ్స్ హెచ్చరించింది. ముడి చమురు ధరలు పెరిగితే చమురు కంపెనీలు లాభపడతాయి. రిఫైనరీల మార్జిన్లు తగ్గుతాయి. ప్యాకేజింగ్, ప్లాస్టిక్ ఉత్పత్తులు, రంగులు, ప్రత్యేక రసాయనాలు సహా పరిశ్రమలకు ముడి చమురుతో పరోక్ష సంబంధం ఉంటుంది. ముడి చమురు ధరలు పెరిగితే ఆయా కంపెనీలు ఆ భారాన్ని వినియోగదారుల పైనే వేస్తాయి. దీనివల్ల డిమాండ్ లేదా లాభంపై ప్రభావం పడుతుంది. ఉద్రిక్తతలు పెరిగితే రవాణా ఛార్జీలు, లాజిస్టిక్ ఖర్చులు కూడా పెరిగిపోతాయి. కిరాణా సరుకుల సరఫరాలకు విఘాతం కలగడంతో ఎంఎస్ఎంఈల ఖర్చులు పెరుగుతాయి. ఈ వ్యాపారాలన్నింటికీ ఇన్‌పుట్ ఖర్చులు పెరగడం, డిమాండ్ పెరగకపోవడం వల్ల మార్జిన్లు తగ్గిపోతాయి.

బంగారం ధర కూడా...

పశ్చిమాసియా ఘర్షణల కారణంగా దేశంలో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. రూపాయి బలహీనపడడం, సురక్షిత ఆస్తుల వైపు మదుపుదారులు దృష్టి సారించడంతో ఇప్పటికే పది గ్రాముల బంగారం ధర లక్ష రూపాయలు దాటింది. పెట్టుబడి డిమాండ్ బలంగానే ఉన్నప్పటికీ ధరల పెరుగుదల కారణంగా రిటైల్ ఆభరణాలకు డిమాండ్ మాత్రం అలాగే ఉంది.

సముద్ర రవాణా భారమే

మేలో ఎర్ర సముద్రంలో పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవడంతో నౌకాయానం మామూలుగానే జరిగింది. అయితే పశ్చిమాసియాలో తాజా ఘర్షణల కారణంగా వ్యాపారులలో ఆందోళన పెరుగుతోంది. భారత్ తన ముడి చమురు అవసరాలలో 80 శాతానికి పైగా దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల స్థూల ఆర్థిక సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ఎర్ర సముద్రంలో ప్రయాణిస్తున్న నౌకలు కేప్ ఆఫ్ గుడ్ హోప్ మార్గాన్ని ఎంచుకుంటే దూరం పెరుగుతుంది. దాంతో పాటే రవాణా ఛార్జీలు కూడా అధికమవుతాయి. ప్రయాణ సమయం 10-14 రోజులు పెరిగే అవకాశం ఉంది. నౌకల లభ్యత కూడా తగ్గిపోతుంది. ఫలితంగా రవాణా, బీమా ఛార్జీలు పెరిగిపోతాయి. 2022లో సూయజ్ కాలువ ద్వారా 34.94 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీ రవాణా జరిగింది.

ఎయిరిండియాను వీడని సాంకేతిక సమస్యలు

లక్నో : ఎయిరిండియాను సాంకేతిక సమస్యలు వేధిస్తూనేవున్నాయి. తాజాగా ఎయిరిండియా విమానం ఐఎక్స్ 1511 సాంకేతిక సమస్యలతో రన్‌వేపైనే నిలిచిపోయింది. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ విమానాశ్రయం నుంచి పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాకు బయలుదేరాల్సిన ఈ విమానం టేకాఫ్‌కు కాసేపటికి ముందే సాంకేతిక సమస్యలకు గురైంది. దీన్ని వెంటనే గుర్తించిన సిబ్బంది విమానాన్ని రన్‌వేపైనే నిలిపివేశారు.

ఎఫ్-35 ఫైటర్ జెట్ అత్యవసర ల్యాండింగ్

బ్రిటన్‌కు చెందిన ఎఫ్-35బి రకం యుద్ధ విమానం కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేసింది. హిందూ మహాసముద్రంపై ప్రయాణిస్తున్న సమయంలో అందులో ఇంధనం తగ్గిపోవడమే దీనికి కారణంగా తెలుస్తోంది. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది.

విజయ్ రూపానీ మృతదేహం గుర్తింపు

- మరో 30 మంది ఆనవాళ్ల నిర్ధారణ

అహ్మదాబాద్ : గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మృతదేహాన్ని గుర్తించినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి రిషికేశ్ పటేల్ ఆదివారం వెల్లడించారు. అహ్మదాబాద్‌లో ఈ నెల 12న జరిగిన విమాన ప్రమాదంలో రూపానీ మరణించిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రమాదంలో గుర్తు పట్టలేనంతగా మృతదేహాలు ఉండటంతో డిఎన్ఎ పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేయాల్సివస్తోంది. ఈ క్రమంలో ఇప్పటి వరకూ డిఎన్ఎ పరీక్షల ద్వారా 32 మంది మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. ఇందులో 14 మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించినట్లు అధికారులు చెప్పారు. ఈ నెల 12న అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరిన ఎయిర్ ఇండియాకు చెందిన 787-8 విమానం కొన్ని నిమిషాల వ్యవధిలోనే కుప్పకూలిన సంగతి తెలిసిందే. విమానంలో ఉన్న 242 మందిలో ఒక్కరు మినహా 241 మంది మరణించారు. మృతుల్లో విజయ్ రూపానీ కూడా ఉన్నారు. ప్రమాదం స్థలం నుంచి శుక్రవారం బ్లాక్ బాక్స్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. బ్లాక్ బాక్స్‌ను విశ్లేషించిన తరువాత ప్రమాదానికి కారణమైన ఆధారాలు లభ్యమవుతాయని భావిస్తున్నారు.

నేడు దర్యాప్తు కమిటీ భేటీ

కాగా ఈ ప్రమాదంపై దర్యాప్తు కోసం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ ఈ నెల 16న సోమవారం న్యూఢిల్లీలో తొలిసారి భేటీ కానుంది. కేంద్ర హోంశాఖ కార్యదర్శి అధ్యక్షతన నియమించిన ఈ కమిటీ మూడు నెలల గడువులోగా నివేదిక సమర్పించాల్సివుంది. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన చర్యలపైన కూడా కమిటీ దృష్టి సారించనుంది.

సైప్రస్ చేరుకున్న ప్రధాని మోడీ

నికోసియా : మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ ద్వీప దేశమైన సైప్రస్‌కు ఆదివారం చేరుకున్నారు. దేశాధ్యక్షులు నికోస్ క్రిస్టోడోలైడ్స్ ఆయనకు స్వాగతం పలికారు. రెండు రోజుల పాటు ప్రధాని మోడీ పర్యటన కొనసాగనుంది. 23 ఏళ్ల తర్వాత ఓ భారత ప్రధాని సైప్రస్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇందులో భాగంగా క్రిస్టోడౌలైడ్స్‌తో మోడీ సమావేశం కానున్నారు. వాణిజ్యం, సాంకేతికత, రక్షణ, పునరుత్పాదక ఇంధనం, కౌంటర్ టెర్రరిజం తదితర రంగాల్లో సహకారాన్ని మరింత పెంపొందించుకునే దిశగా చర్చలు జరపనున్నారు. మూడు దేశాల పర్యటనకు బయల్దేరే ముందు ప్రధాని మోడీ ఓ ట్వీట్ చేస్తూ.. మధ్యధరా, ఇయు ప్రాంతంలో సైప్రస్‌ను విలువైన భాగస్వామిగా పేర్కొన్నారు. ఈ పర్యటన ఇరుదేశాల మధ్య వాణిజ్యం, సాంస్కృతికం వంటి కీలక రంగాల్లో సంబంధాలను మరింత పెంపొందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే.. ఇజ్రాయిల్-ఇరాన్ పరస్పర దాడుల కారణంగా పశ్చిమాసియాలో గగనతల ఆంక్షల నేపథ్యంలో ప్రధాని మోడీ విమానం అరేబియా సముద్రం, ఆఫ్రికా గగనతలం మీదుగా సైప్రస్‌కు చేరుకున్నట్లు సమాచారం. సైప్రస్ నుంచి ప్రధాని మోడీ నేరుగా కెనడాకు వెళ్తారు. ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు జూన్ 16-17న కననాస్కిస్‌లో జరగనున్న జి-7 సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో ప్రధాని మోడీ పాల్గొనడం వరుసగా ఆరోసారి. ఇందులో భాగంగా జి-7 దేశాధినేతలతో సమావేశం కానున్నారు.

అమెరికాలో నిరసనల హోరు

- ఉధృతంగా 'నో కింగ్స్' ఆందోళనలు
- ట్రంప్‌కు వ్యతిరేకంగా వీధుల్లోకి లక్షలాది జనం

లాస్ ఏంజెల్స్‌లో జరిగిన నిరసన ర్యాలీలో ట్రంప్ దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న ప్రజలు

న్యూయార్క్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు వ్యతిరేకంగా అమెరికాలో నిరసనలు హోరెత్తుతున్నాయి. 'నో కింగ్స్' పేరిట దేశవ్యాప్తంగా సాగుతున్న ఆందోళనల్లో లక్షలాది మంది ప్రజానీకం పాల్గొంటున్నారు. ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపడుతున్నవారు కూడా ఇప్పుడు 'నో కింగ్స్' ఉద్యమంలో భాగస్వాములు కావడంతో నిరసనలు మరింత ఉధృతంగా సాగుతున్నాయి. శనివారం దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. నగరాలు, చిన్న పట్టణాల్లోని వీధులు, పార్కులు, బహిరంగ ప్రదేశాలు ఆందోళనకారులతో నిండిపోయాయి. ప్రజాస్వామ్యాన్ని, వలసదారుల హక్కులను కాపాడాలని, నియంతృత్వాన్ని వ్యతిరేకిస్తూ, మేం రాజులను అంగీకరించమని నినాదాలు చేశారు. ఈ నిరసనోద్యమంలో దేశవ్యాప్తంగా కోట్లాది మంది పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. కొన్ని చోట్ల నేషనల్ గార్డ్‌ను మోహరించారు. అయితే నిరసనోద్యమాన్ని అణిచేసేందుకు ట్రంప్ సర్కార్ శతవిధాలా ప్రయత్నాలు చేస్తోంది. 'నో కింగ్స్'కు లభిస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక దానికి ప్రతిగా సైనిక పరేడ్‌ను ప్రత్యేక ఉత్సవాలుగా నిర్వహించాలని ట్రంప్ భావించారు. కానీ సైనిక పరేడ్‌కు మించి 'నో కింగ్స్' ఉద్యమానికి ఆదరణ లభించడం విశేషం. ఈ సైనిక పరేడ్‌ను వీక్షించేందుకు వాషింగ్టన్‌లో ట్రంప్ ఉన్న సమయంలోనే అక్కడ కూడా 'గో బ్యాక్ ట్రంప్' అంటూ నిరసనలు హోరెత్తాయి.

నిరసన గళాలతో మార్మోగిన నగరాలు

అమెరికాలోని ప్రసిద్ధ నగరాలన్నీ ట్రంప్ వ్యతిరేక నిరసన గళాలతో మార్మోగాయి. న్యూయార్క్, డెన్వర్, చికాగో, ఆస్టిన్, లాస్ ఏంజెల్స్‌లో భారీ ర్యాలీలు జరిగాయి. సీటెల్‌లో 70,000 మందికి పైగా పాల్గొన్నట్లు అంచనా. అట్లాంటాలోనూ వేలాది మందితో ప్రదర్శన సాగింది. 'నో కింగ్స్' పేరిట పెద్దపెద్ద బ్యానర్లు ప్రదర్శిస్తూ.. అమెరికా, మెక్సికో జెండాలు చేబట్టి ఆందోళనకారులు ఉత్సాహంగా ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. ట్రంప్ యుద్ధోన్మాద, ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని నినదించారు. 'రాజులు వద్దు..ప్రజాస్వామ్యం ముద్దు' అంటూ నినదించారు.

లాస్ ఏంజెల్స్‌లో ఉద్రిక్తత

వలస విధానాలపై గత వారం ప్రారంభమైన నిరసనలు దేశమంతా వ్యాపించాయి. లాస్ ఏంజెల్స్‌లో శనివారం నిరసనలు ముగిసిన తర్వాత, పోలీసులు టియర్ గ్యాస్, రబ్బరు బుల్లెట్లను ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు. పోర్ట్‌లాండ్‌లోని ఇమ్మిగ్రేషన్ భవనం వద్ద పోలీసులు టియర్ గ్యాస్, ప్రొజెక్టైల్స్ ఉపయోగించారు.యూటాలోని సాల్ట్ లేక్ సిటీలో నిరసన సందర్భంగా చోటు చేసుకున్న కాల్పుల్లో ఒకరు తీవ్రంగా గాయపడగా,ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు ప్రకటించారు. అమెరికన్లు అన్ని చోట్లా ఒకటే స్వరంతో మాకు రాజులు వద్దు అని, ఈ నిరసనల్లో లక్షలాది మంది పాల్గొన్నారని నో కింగ్స్ కోలిషన్ ప్రతినిధులు ప్రకటించారు. ట్రంప్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో ఇదే పెద్దదిగా వారు పేర్కొన్నారు.

పుట్టినరోజు సంబరాల్లో సైనిక కవాతులా?

కాగా ట్రంప్ పుట్టిన రోజునే సైనిక పరేడ్ నిర్వహించడం ఆందోళనకారులకు మరింత ఆగ్రహాన్ని తెప్పించింది. ట్రంప్ తన 79వ పుట్టిన రోజు సందర్భంగా శనివారం రోజున రాజధాని కాన్స్టిట్యూషన్ అవెన్యూలో భారీ సైనిక కవాతును నిర్వహించారు. దీనిని మాజీ సైనికాధికారులు సైతం తీవ్రంగా ఖండించారు. శనివారం తెల్లవారుజామున ప్రారంభమైన ఈ సైనిక కవాతును వీక్షించడానికి వైట్‌హౌస్‌కు దక్షిణంగా ఉన్న ప్రత్యేక స్టాండ్‌పై ట్రంప్ కూర్చుని ఉండగా, ఆయన ముందు 128 ట్యాంకులు, 6 వేల మందికి పైగా సైనికులతో ఈ కవాతు జరిగింది. 21 గన్ సెల్యూట్‌తో ట్రంప్‌నకు వందనం కూడా జరిగింది. ట్రంప్ తన మొదటి పదవీ కాలంలోనే ఇలాంటి కవాతు నిర్వహించడానికి ప్రయత్నించారు. కానీ అప్పుడు సాధ్యం కాలేదు. రెండోసారి అధ్యక్షుడైన తరువాత ట్రంప్ ఈ సారి తన కలను నెరవేర్చుకున్నారు.

నిల్వలే కారణమట!

(మొదటి పేజీ తరువాయి)

పొగాకు రైతుల పిల్లలకు విద్యారుణాలు ఇస్తామని, రూ.రెండు లక్షల నుంచి గరిష్ట పరిమితి రూ.ఐదు లక్షలకు పెంచుతున్నామని తెలిపారు. రైతుల పిల్లలకు వివిధ అంశాలలో గుంటూరులోని నేషనల్ డిజైన్ సెంటర్‌లో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పొగాకు రైతులకు విదేశీ భాషలను నేర్పేందుకు కూడా శిక్షణ ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిపై కేంద్రం దృష్టి సారించిందని, కృష్ణపట్నం ఓడరేవు అభివృద్ధికి టెండర్లు పిలిచామని, త్వరలో ఖరారు అవుతాయని చెప్పారు. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక వాడల అభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. తడ వద్ద ఉన్న శ్రీసిటీలో అనేక పరిశ్రమల ద్వారా వేలాది మంది ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్యశాఖ మంత్రి టి.జి.భరత్, ఎమ్మెల్యే జి.మాధవి, మేయర్ కె.రవీంద్ర, డిప్యూటీ మేయర్ సజీల తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడులు

- ఇరాన్‌పై మూడో రోజు కొనసాగిన క్షిపణి దాడులు
- ప్రతిఘటిస్తున్న ఇరాన్

టెహ్రాన్, టెల్‌అవీవ్ : యుద్ధోన్మాదంతో రగిలిపోతున్న ఇజ్రాయిల్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరింతగా ఆజ్యం పోస్తున్నారు. ఇజ్రాయిల్ చర్యలకు ఒకవైపు వంత పాడుతూ..మరోవైపు ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు జారీ చేయడంతో నెతన్యాహు సర్కార్ మరింతగా రెచ్చిపోతోంది. మూడో రోజు అయిన ఆదివారం కూడా ఇరాన్‌పై ఇజ్రాయిల్ సైన్యం భారీ వైమానిక దాడులకు తెగబడింది. మరిన్ని దాడులు చేస్తామని హెచ్చరించింది. మరోవైపు ఇరాన్ కూడా తీవ్రస్థాయిలో రక్షణాత్మక చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో ఇజ్రాయిల్‌లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ప్రతి దాడులు చేస్తోంది. ఇజ్రాయిల్ రక్షణ వ్యవస్థలను తప్పించుకుంటూ ఇరాన్ క్షిపణులు ఆ దేశ కీలకమైన ప్రాంతాలను తాకాయి. అన్యాయంగా తమ దేశంపై ఇజ్రాయిల్ చేపట్టిన దాడులను ఆపివేస్తే తాము కూడా ఆత్మరక్షణ చర్యలను నిలిపివేస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి తెలిపారు. రాజధాని టెహ్రాన్ సమీపంలోని ఒక చమురు శుద్ధి కర్మాగారాన్ని, బుషెహర్ ప్రావిన్స్‌లోని మరొక చమురు శుద్ధి కర్మాగారాన్ని ఇజ్రాయిల్ లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడినట్లు ఆయన చెప్పారు. అందువల్లే తాము ఆత్మరక్షణ చర్యలు చేపట్టాల్సివచ్చిందన్నారు. ఇజ్రాయిల్‌లోని సైనిక, ఆర్థిక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు. ఇజ్రాయిల్ దాడుల కారణంగా ఇరాన్‌లో గతరెండు రోజుల్లో దాదాపు 80 మంది మరణించారు. 800 మంది పైగా గాయపడ్డారు. కాగా ఇజ్రాయిల్ దాడులను ప్రతిఘటిస్తూ ఇరాన్ చేపట్టిన రక్షణ చర్యల్లో 13 మంది ఇజ్రాయిలు చనిపోయినట్లు తెలిసింది.

ఇరాన్‌లోని ఇంధన సంస్థ పై ఇజ్రాయిల్ దాడితో ఎగిసిపడుతున్న మంటలు

గాజాలో అమానవీయదాడులు

పాలస్తీనియన్ పౌరులను లక్ష్యంగా చేసుకొని గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయిల్ తన అమానీయ దాడులను కొనసాగిస్తూనేవుంది. గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇప్పటి వరకు ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి ఒక్క గాజాలోనే 55,362 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో అత్యధికులు చిన్నారులు, మహిళలే. మరో 128741 మంది గాయపడ్డారు.

ట్రంప్ హెచ్చరికలు

ఇజ్రాయిల్ దాడులను నిలిపివేస్తే తాము కూడా రక్షణాత్మక చర్యలు ఆపేస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి ప్రకటించిన కాసేపటికే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో హెచ్చరికలు జారీ చేశారు. ఇజ్రాయిల్ చేస్తున్న దాడులతో తమకు సంబంధం లేదని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో తమపై దాడులు చేస్తే కనివినీ ఎరుగని రీతిలో టెహ్రాన్‌పై విరుచుకుపడతామని ట్రంప్ హెచ్చరించారు. మరోవైపు భారత్-పాకిస్థాన్ మధ్య సంధి కుదర్చినట్లుగానే ఇజ్రాయిల్ - ఇరాన్ మధ్య కూడా త్వరలోనే శాంతి ఒప్పందం ఏర్పడుతుందని, ఇందుకోసం తామే కృషి చేస్తామని ట్రంప్ చెప్పుకొచ్చారు.

ఎస్ఎఫ్ఐ గుజరాత్ రాష్ట్ర కమిటీ అధ్యక్షకార్యదర్శులుగా హరికృష్ణ రాథోడ్, సత్యేశ

అహ్మదాబాద్ : భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) గుజరాత్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులుగా హరికృష్ణ రాథోడ్, కార్యదర్శిగా సత్యేశ లేవువా ఎన్నికయ్యారు. అహ్మదాబాద్‌లో శనివారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ 4వ రాష్ట్ర మహాసభలో 21 మంది సభ్యులతో రాష్ట్ర కమిటీ, ఏడుగురు సభ్యులతో రాష్ట్ర కార్యదర్శివర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. తొలుత విద్యార్థి ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు, అహ్మదాబాద్ విమానప్రమాద మృతులకు మహాసభ నివాళులర్పించింది. అనంతరం ఎస్ఎఫ్ఐ ప్రధానకార్యదర్శి మయూఖ్ బిశ్వాస్ మహాసభను ప్రారంభించారు. రాష్ట్రంలో విద్యార్థులు, యువత, రైతులు, కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభ చర్చించింది. నాలుగేళ్ల యుజిసి ప్రోగ్రామ్, ధరల పెంపు, ప్రశ్నాపత్రాల లీకేజీ, నిరుద్యోగం, ఫెలోషిప్పులు, ఉపకారవేతనాల చెల్లింపుల్లో జాప్యాలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల లేమి వంటి సమస్యలపై ప్రతినిధులు చర్చించి వాటి పరిష్కారానికి డిమాండ్ చేస్తూ పలు తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఏడు జిల్లాల నుంచి 111 మంది ప్రతినిధులు మహాసభకు హాజరయ్యారు.

ఉత్తరాఖండ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా శైలేంద్ర, నితీన్

ఎస్ఎఫ్ఐ ఉత్తరాఖండ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులుగా నితీన్ మలేథ, కార్యదర్శిగా శైలేంద్ర పర్మార్ ఎన్నికయ్యారు. డెహ్రాడున్‌లో ఇటీవల ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 7వ మహాసభ ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను ఈ మహాసభను ప్రారంభించారు. విద్యారంగ సమస్యలపై చర్చ అనంతరం 13 మంది సభ్యులతో రాష్ట్ర కమిటీ, 5 మంది సభ్యులతో రాష్ట్ర కార్యదర్శివర్గాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

ఆస్ట్రేలియాలో 'జార్జి ఫ్లాయిడ్' తరహా దారుణం

- భారత సంతతి వ్యక్తి మృతి

అడిలైడ్ : అమెరికాలో 2020లో ఆఫ్రో- అమెరికన్ జార్జి ఫ్లాయిడ్‌పై జరిగిన ఉదంతాన్ని ప్రపంచం ఇప్పటికీ మరచిపోలేదు. పోలీసులు అదిమిపట్టడంతో తనకు ఊపిరి అందడం లేదని జార్జి ఫ్లాయిడ్ ఎంత వేడుకున్నా వారు వినలేదు. దీంతో జార్జి ఫ్లాయిడ్ మరణించారు. తాజాగా అలాంటి ఘటనే ఆస్ట్రేలియాలో జరిగింది. ఈ ఘటనలో మృతుడు భారత సంతతి వ్యక్తి కావడం మరింత విషాదకరం. ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో భారత సంతతికి చెందిన గౌరవ్ కుండి అనే యువకుడిపై అక్కడి పోలీసులు ఇటీవల కర్కశంగా వ్యవహరించారు. ఈ క్రమంలో తీవ్ర గాయాలపాలైన గౌరవ్.. చికిత్స పొందుతూ మృతి చెందారు.

అడిలైడ్‌లో ఉండే గౌరవ్ కుండి, అమృత్‌పాల్ కౌర్ దంపతుల మధ్య ఇటీవల చిన్న వాగ్వాదం చోటుచేసుకుంది. అది గమనించిన పెట్రోలింగ్ పోలీసులు గృహ హింసగా భావించారు. దీంతో ఇంట్లోకి దూసుకొచ్చి గౌరవ్‌ను అదుపులోకి తీసుకొనేందుకు ప్రయత్నించారు. అయితే, తమ మధ్య ఎలాంటి గొడవ లేదని, కేవలం చిన్న వాగ్వాదమేనని అమృత్‌పాల్ వారించినప్పటికీ పోలీసులు వినిపించుకోలేదు. అలాగే, తాను ఎలాంటి నేరం చేయలేదని గౌరవ్ ఎంత వేడుకున్నా కనికరించలేదు. అతడిని బలవంతంగా నేలపై పడేసి అరెస్టు చేసేందుకు యత్నించారు. ఈ ఘటనను అమృత్‌పాల్ తన కెమెరాలో చిత్రీకరించడంతో పోలీసుల కర్కశత్వం బయటపడింది.

కిందపడిన తన భర్త మెడను ఓ పోలీసు అధికారి మోకాలితో గట్టిగా అదిమి పట్టాడని, అరెస్టు సమయంలో తల నేలకు, పోలీసు వాహనానికి బలంగా తాకడంతో గౌరవ్ అక్కడే స్పృహ కోల్పోయాడని అమృత్‌పాల్ తెలిపారు. ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అతడి మెదడు, మెడ నరాలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. చికిత్స పొందుతూ గౌరవ్ కుండి మరణించారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి తమకు న్యాయం చేయాలని అమృత్‌పాల్ వేడుకున్నారు.

విదేశాంగ విధానం గందరగోళం

- ఐరాస తీర్మానంపై ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టిన కాంగ్రెస్

న్యూఢిల్లీ : గాజాలో కాల్పుల విరమణ కోరుతూ ఐక్యరాజ్యసమితి ఆమోదించిన తీర్మానంపై ఓటింగ్ జరిగినప్పుడు భారత్ గైర్హాజరు కావడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. భారత విదేశాంగ విధానం అస్తవ్యస్థంగా, గందరగోళంగా ఉన్నదని విమర్శించింది. పశ్చిమాసియాలో శాంతి స్థాపన కోసం కాల్పుల విరమణ పాటించి చర్చలు జరపాలంటూ ఇప్పటి వరకూ ప్రవచనాలు పలికిన కేంద్రం ఆ వైఖరిని విడనాడిందా అని ప్రశ్నించింది. ఓటింగ్‌కు గైర్హాజరు కావాలన్న నిర్ణయంతో భారత్ ఒంటరి అయిందని వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వ వైఖరిని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శించారు. విదేశాంగ మంత్రి జయశంకర్ పదే పదే చేస్తున్న తప్పులను ప్రధాని నరేంద్ర మోడీ సరిదిద్దాలని, జవాబుదారీతనంతో వ్యవహరించేలా చూడాలని ఖర్గే సూచించారు.

'గాజాలో కాల్పుల విరమణ పాటించాలంటూ ఐరాస ఆమోదించిన తీర్మానానికి 149 దేశాలు మద్దతు తెలిపాయి. 19 దేశాలు మాత్రమే ఓటింగుకు గైర్హాజరు కాగా వాటిలో భారత్ కూడా ఉంది. ఈ చర్యతో మనం ఒంటరిగా మిగిలిపోయాం' అని ఖర్గే చెప్పారు. ఇజ్రాయిల్ ప్రజలపై హమాస్ జరుపుతున్న దాడులను కూడా కాంగ్రెస్ ఖండిస్తోందని ఆయన గుర్తు చేశారు. అలీన సిద్ధాంతానికి, నైతిక దౌత్యానికి కట్టుబడి ఉండడం భారత్ దీర్ఘకాలిక వైఖరి అని తెలిపారు. కాగా దక్షిణాసియా, బ్రిక్స్, ఎస్‌సీఓలో ఐరాస తీర్మానంపై ఓటింగ్‌కు దూరంగా ఉన్న ఏకైక దేశం మనదేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. 'నెహ్రూ వారసత్వంపై వారికి గౌరవం ఎలాగూ లేదు. కానీ పాలస్తీనాపై వాజ్‌పేయి అవలంబించిన వైఖరికి ఎందుకు దూరంగా ఉన్నారు?' అని ప్రశ్నించారు. ఐరాస తీర్మానంపై ఓటింగుకు భారత్ గైర్హాజరు కావడం సిగ్గుచేటు, విచారకరమని ప్రియాంక గాంధీ అన్నారు.

బడికి దూరంగా 27 కోట్ల మంది చిన్నారులు

- గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ నివేదిక

న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో దాదాపు 27.2 కోట్ల మంది చిన్నారులు బడికి దూరంగా ఉన్నారు. యునెస్కోకు చెందిన గ్లోబల్ ఎడ్యుకేషన్ మానటరింగ్ టీం (జెమ్) ఈ మేరకు అంచనా వేసింది. గత ఏడాది వేసిన అంచనా కంటే ఇది 2.1 కోట్ల మంది ఎక్కువ కావడం గమనార్హం. బడికి దూరంగా ఉన్న చిన్నారుల సంఖ్య భారీగా పెరగడంపై నివేదిక రెండు కారణాలను ముఖ్యంగా పేర్కొంది. ఒకటి నూతన నమోదు, హాజరు డేటాను పరిగణనలోకి తీసుకోవడం, రెండోవది ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ల ప్రభుత్వం అక్కడి బాలికల విద్యపై నిషేధం విధించడం. ఐరాస నియమాల ప్రకారం ఆరు నుంచి 17 ఏళ్ల వయస్సు కలిగినవారిని బడికి వెళ్లే వయస్సు వారుగా వర్గీకరిస్తారు. ఐరాస నవీకరించిన జనాభా అంచనాలు కారణంగా ఈ చిన్నారుల సంఖ్య భారీగా పెరిగిందని నివేదిక తెలిపింది. అలాగే, తాము వెల్లడించిన సంఖ్య కంటే బడికి దూరంగా ఉంటే చిన్నారుల సంఖ్య ఇంకా అధికంగా ఉండే అవకాశం లేకపోలేదని తెలిపింది. ఎందుకంటే ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సంఘర్షణల వాతావరణం నెలకుందని, ఇలాంటి వాతావరణం కారణంగా వాస్తవమైన డేటా సేకరణకు అంతరాయం కలుగుతుందని నివేదిక పేర్కొంది. అలాగే బడికి బయట ఉన్న చిన్నారులపై సంఘర్షణల వాతావరణం ప్రభావాన్ని తక్కువగా అంచనా వేస్తున్నారని తెలిపింది. ఏదేమైనా సరే ప్రపంచవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాల వయస్సు పిల్లల్లో 11 శాతం (దాదాపు 7.8 కోట్లు మంది), లోయర్ సెకండరీ పాఠశాల వయస్సు చిన్నారుల్లో 15 శాత మంది (6.4 కోట్లు), ఉన్నత పాఠశాల వయస్సు చిన్నారుల్లో 31 శాతం (దాదాపు 13 కోట్ల మంది) చిన్నారులు బడికి దూరంగా ఉన్నారని నివేదిక తెలిపింది. వివిధ దేశాలు తమ జాతీయ లక్ష్యాలను సాధించడంలో విఫలమైతే ఈ సంఖ్య పెరుగుదల కొనసాగుతూనే ఉంటుందని, ఒకవేళ దేశాలు తమ లక్ష్యాలను సాధించగలిగితే 2030 నాటికి బడికి దూరంగా ఉన్న చిన్నారుల సంఖ్యను 16.5 కోట్లకు తగ్గించవచ్చునని నివేదిక పేర్కొంది.

జీవన సౌరభం

మేధావులు మౌనంగా ఉన్నంత కాలం మూర్ఖులు రాజ్యం ఏలతారు.

మీకోసం

పచ్చి మిరపకాయలు కోసిన తరువాత చేతులు మంట పుడుతుంటే.. పంచదార కలిపిన నీటితో చేతులు కడుక్కోవాలి.

సెలవుల్లో పుస్తకాలు చదివాను



హాయ్ ఫ్రెండ్స్,

నా పేరు బత్తుల సాయి దీక్షిత్. మా గ్రామం జైనద్ మండలంలోని లక్ష్మీపూర్. నేను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మీపూర్‌లో ఏడవ తరగతి చదువుతున్నాను. ఈ వేసవి సెలవుల్లో నేను బోలెడు పుస్తకాలు చదివాను. ప్రతి శనివారం మా బడిలో లైబ్రరీ నిర్వహించారు. మా బడిలోని తొమ్మిదో తరగతి విద్యార్థినులు బి. రితిక, కె. లక్ష్మీప్రసన్న, హెచ్. వైశాలి, జి.సుజాత, బి. అక్షయ మాకు ప్రతి శనివారం లైబ్రరీ పెట్టి పుస్తకాలు చదివించారు. నేను 'కుమ్మరి నర్సయ్య', 'చింతకాయల బేరం', 'రంగు రంగుల చక్రాల బండి', 'స్ఫూర్తి పిల్లల కథలు', 'భలే బాతు' మొదలైన పుస్తకాలు చదివాను. కొన్ని కథలు నవ్వించేవిగా ఉన్నాయి. కొన్ని ఆశ్చర్యంగా అనిపించాయి. ఈ లైబ్రరీ వల్ల ఈ వేసవి సెలవుల్లో నాకు పుస్తకాలు చదవడం అలవాటైంది.

- బత్తుల సాయి దీక్షిత్, 7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
లక్ష్మీ పూర్, ఆదిలాబాద్ జిల్లా.

బొమ్మ గీయండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న అంకెలను వరుసగా కలిపితే కుక్కపిల్ల బొమ్మ వస్తుంది. ప్రయత్నించి చూడండి.

నేను గీసిన బొమ్మ

మంగినిపల్లి సంజన,
8వ తరగతి,
జిల్లాపరిషత్
ఉన్నతపాఠశాల,
నిజంపేట.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

క్యాంపస్ టు కెరీర్ ...

జీవితంలో ఎదగాలన్నా... ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నా... పనిచేసే చోట మరింత మెరుగైన ఫలితాలు సాధించాలన్నా కొన్ని కెరీర్, టెక్నికల్, జీవన నైపుణ్యాలు అవసరం. వీటిని పాటించటం ద్వారా జీవితంలో, పనిచేసే ఉద్యోగంలో మరింత నాణ్యతగా రాణించొచ్చు. భావప్రకటన, చొరవ-ప్రేరణ, సమ్మతికి సంప్రదింపులు, నిర్వహణ, సమస్యా పరిష్కారం, ఒత్తిడిలో పనిచేయటం, నాయకత్వ లక్షణాలు వంటివి అలవర్చుకుంటే ఏ రంగంలోనైనా రాణించొచ్చు. దానికి కాన్ఫిడెన్స్.. క్యారెక్టర్... కాంపిటెన్స్ వంటివి కూడా కావాలి.

ఏదైనా ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవడానికి విద్యార్హతలు, అనుభవం సరిపోతాయి. ఎంపిక కావడానికి, విజయం సాధించటానికి మాత్రం కొన్ని నైపుణ్యాలు అవసరమవుతాయి. నియామక సంస్థలు వీటిని ప్రత్యేకంగా ఉద్యోగ అర్హతల్లో పేర్కొనపోవచ్చు. కానీ అవి అభ్యర్థిలో ఉన్నాయో లేదో తప్పక పరిశీలిస్తాయి. సాంకేతికంగా పట్టు, సబ్జెక్టు పరిజ్ఞానంతోపాటు నైపుణ్యాలున్న వారికి ప్రాధాన్యత ఇస్తారు. సాధారణంగా ఉద్యోగ సంబంధిత నైపుణ్యాలైన మెషినరీ, సంస్థ ఉపయోగించే ప్రత్యేక సాఫ్ట్‌వేర్ టెక్నిక్‌లు వంటి వాటిపై సంస్థలే శిక్షణనిస్తాయి. ఇతర నైపుణ్యాలు అభ్యర్థిలో ఉన్నాయో లేదో ఎంపిక సమయంలో చూస్తాయి. అందుకే విద్యార్థి దశనుంచే వాటిపై దృష్టి సారించటం మంచిది. విద్యార్థులు తమలో లేనివాటిని ప్రయత్నపూర్వకంగా నేర్చుకుని సానపెట్టుకోవాలి. వీటిని కోర్సుల్లో భాగంగా నిత్యజీవిత అనుభవాలతో నేర్చుకోవచ్చు. మేము చదువుకునే కాలంలో పోటీపరీక్షలు రాసి వాటిలో ప్రతిభ ఆధారంగా ఉద్యోగాల్లో చేరాం. ఇప్పుడు చదువు ప్రాధాన్యత బాగా పెరిగింది. గ్లోబల్‌స్థాయిలో ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చాయి. గతంతో పోలిస్తే ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉద్యోగాలకు పోటీ బాగా పెరిగిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం చదువుతోపాటు టెక్నికల్ స్కిల్స్‌తోపాటుగా వ్యక్తిత్వ నాణ్యత, నాయకత్వ లక్షణాలు కూడా అవసరం. అందుకే ఇప్పుడు ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాల్లోనైనా ఇంటర్వ్యూలు కీలకంగా మారాయి. కొన్ని కీలక అంశాల గురించి తెలుసుకుందాం..

లక్ష్య నిర్ధారణ : చదువుకునే రోజుల నుంచే విద్యార్థి దశలోనే భవిష్యత్తులో ఏమవుతాననుకుంటున్నామనే అవగాహన పెంపొందించుకోవాలి. ఇంట్లోనూ, విద్యాలయాల్లోనూ భవిష్యత్తు అవకాశాలపై అవగాహన కల్పించటం ముఖ్యం. తద్వారా వారు ఆలోచన చేసి లక్ష్యాన్ని నిర్ధారించుకుంటారు. భావప్రకటనా నైపుణ్యాలను పెంచుకుంటారు. ఏదైనా ఒక విషయాన్ని స్పష్టంగా ఎదుటి వారికి అర్థమయ్యే విధంగా చెప్పగల సామర్థ్యం చాలా కీలకం. రాయడం ద్వారా, మాట్లాడటం ద్వారా విషయాన్ని చేరవేసే పరిణితి పొందుతారు. ఎదుటి వారు చెప్పేది శ్రద్ధగా వినటం, దానికి అనుగుణంగా సరైన రీతితో స్పందించటం కూడా ప్రధానమే. లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఉన్న మార్గాల గురించి అన్వేషిస్తారు. ఇంటర్నెట్ కూడా దోహదపడుతుంది. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు, డిబేట్ల ద్వారా ఒక విషయాన్ని ఆసక్తికంగా ఎదుటివారికి అర్థమయ్యేలా వివరించటానికి ప్రాక్టీస్ చేయొచ్చు. ఇది కూడా నైపుణ్యంలో భాగమే!

ఉద్యోగ అన్వేషణ : గతంలో మాదిరిగా ఇప్పుడు జనరల్ కోర్సులతోపాటు టెక్నికల్ కోర్సులో చాలా వచ్చాయి. లేటెస్ట్ వెర్షన్లు సైతం ఉన్నాయి. ఎఐ, ఎంఎల్ వంటివి ప్రపంచాన్ని ఏలుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వృత్తి, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఏ రంగంలో నిలదొక్కుకోవాలంటే ఆయా రంగాన్ని ఎంచుకుని అందులో నైపుణ్యత పెంచే కోర్సులు చేయొచ్చు. వీటికి సంబంధించి మనదేశంతోపాటుగా విదేశాల్లో కూడా మంచి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతి తర్వాత జాబ్ ఓరియెంటేషన్ కోర్సులు సైతం వచ్చాయి. విద్యాపరంగా సబ్జెక్టుల్లో నేర్చే పాఠాలు చాలా వరకూ మన జీవితంలో సాయపడేవే. వాటిని ఇంకాస్త మెరుగ్గా ఎలా చేయొచ్చో ప్రయత్నించొచ్చు. ఇంటర్న్‌షిప్ ప్లేస్‌మెంట్లు నిమిత్తం సొంతంగా సంస్థలను సంప్రదించడం వంటివి చేయొచ్చు.



పోటీ పరీక్షలు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నోటిఫికేషన్లతోపాటుగా ప్రయివేటు, కార్పొరేట్, ప్రయివేటు సంస్థలు కూడా ఉద్యోగ నియామకాలు చేపడుతున్నాయి. దీనికోసం పరీక్షలు పెట్టి వాటిలో నిపుణత ఉన్న వారికి అవకాశాలు కల్పిస్తున్నాయి. అయితే పోటీ పరీక్ష ఏదైనా అందులో రాణించాలంటే ముందుగా వాటి సిలబస్‌పై సమగ్ర అవగాహన అవసరం. సబ్జెక్టు అంశాలతోపాటుగా రీజనింగ్, అర్థమెటిక్; మేథమెటిక్స్, స్టాటస్టిక్స్, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీష్ ప్రావీణ్యం వంటి అంశాలపై అవగాహన అవసరం. బ్యాంక్, బీమాసంస్థలు, పోస్టల్, బిఎస్‌ఎన్‌ఎల్ వంటి సంస్థలతోపాటుగా ప్రభుత్వం వివిధ విభాగాల వారీగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తుంది. వాటిని నిరంతరం గమనిస్తూ పరీక్షలు రాస్తే వాటిలో విజయం సాధించొచ్చు.

ముఖాముఖి : పరీక్షలు రాయటం ఒక ఎత్తయితే ఆ తర్వాత వాటికి అనుబంధంగా నిర్వహించే ముఖాముఖి (ఇంటర్వ్యూ) ని ఎదుర్కోవడం మరొక ఎత్తు. పాత ఇంటర్వ్యూల ఒరవడిని గమనించి, తగిన సన్నద్ధత సాధించాలి. సెల్ఫ్ డిసిప్లిన్ కూడా ముఖ్యమే. తాత్కాలిక టెంప్టేషన్స్‌ను అర్థం చేసుకుని నియంత్రించడం, దీర్ఘకాలిక లక్ష్యాలపై దృష్టిని కేంద్రీకరించడం, వ్యక్తిగత విలువలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం ముఖ్యం. ఇది అకడమిక్ సక్సెస్‌కు మాత్రమే కాదు, వ్యక్తిగత వికాసానికీ అనివార్యమైన నైపుణ్యం. స్వీయ నియంత్రణ ఉన్న టీనేజర్లు అవరోధాలను సులువుగా అధిగమిస్తారు. పరీక్షల కోసం చదవడం లేదా స్నేహితుల ఒత్తిడిని ఎదుర్కోవడం వంటి పనులు సులువుగా నిర్వహించగలుగుతారు. ఇంటర్వ్యూను కూడా సమర్థవంతంగా ఎదుర్కోగలరు.

క్యాంపస్ టు కెరీర్ పేరుతో గత కొన్నేళ్లుగా విద్యార్థి వికాస వాహిని (వివివి) పేరుతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఈ తరగతుల్లో కెరీర్ గోల్ సెట్టింగ్, జాబ్ సెర్చింగ్ మెథడ్స్, కాంపిటేటివ్ ఎగ్జామ్స్, ఇంటర్వ్యూ టెక్నిక్స్ వంటివి బోధిస్తున్నాం.

- వేములపల్లి కేశవరావు,
విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజర్, బిఎస్‌ఎన్‌ఎల్
వ్యవస్థాపక అధ్యక్షులు, విద్యార్థి వికాస వాహిని (వివివి)

గ్రాఫిక్స్.. జిమ్మిక్స్.. మిక్సింగ్.. విఎఫ్ఎక్స్

కళ ఏమేం చేస్తుంది? ఆకలి తీర్చుతుంది. అందలం ఎక్కిస్తుంది. అందరూ శెభాష్ అని మెచ్చుకునేలా చేస్తుంది. అవార్డులూ సాధించి పెడుతుంది. అన్నింటికీ మించి అంతులేని ఆనందాన్ని ఇస్తుంది. అలాంటి కళాత్మకంగా రూపొందించిన సినిమా అనుభూతుల ప్రయాణం. సిఇనమాలు వేలు పట్టుకుని కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తాయి. కొత్త వ్యక్తుల్ని పరిచయం చేస్తాయి. కొన్ని అనుభవాల్ని గుప్పిట్లో పట్టుకుని గుండెల్లో నింపి పంపిస్తాయి. సినిమా ఒక సృజనాత్మకత కళారూపం. అనేక సాంకేతిక నైపుణ్యాల ప్రతిఫలనం.

ఎఐ సహాయంతో ...

వందేళ్ల సినిమా రంగంలో నాటి నుంచి నేటి వరకూ అనేక మార్పులొచ్చాయి. టెక్నాలజీలోనూ అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఉన్నది లేనట్లుగానూ.... లేనిది ఉన్నట్లుగా సృష్టించే ప్రక్రియ కృత్రిమ మేథతో సాధ్యమవుతోంది. ఇప్పటికే ఏఐ యాంకర్ల దగ్గర నుంచి చిన్న చిన్న సినిమాల వరకూ తయారవుతున్నాయి. సోషల్ మీడియాలో ఇవి బాగా ట్రెండ్ అవుతున్న విషయం కూడా మనకు తెలిసిందే. సాంకేతికపరంగా వాస్తవికతకు అద్దం పట్టే అంశాలు కూడా వస్తున్నాయి. లేని సమాజాన్ని, లేని లోకాలను ఊహాజనిత పాత్రలతో ఆవిష్కరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే సినిమాల్లో స్వర్గం, నరకం, దేవలోకం, భూలోకం ... ఇలా కొత్తలోకాలను సృష్టించటం, అందులో కొన్ని మంచి ఆదరణ పొందటం తెలిసిందే.

దర్శకుల ఊహాశక్తికి ఇప్పుడు ఏఐ సాంకేతికత తోడైంది. చిరంజీవి 'జగదేకవీరుడు.. అతిలోక సుందరి', 'యముడికి మొగుడు'; సీనియర్ ఎన్‌టిఆర్ 'యమగోల'; జూనియర్ ఎన్‌టిఆర్ 'యమదొంగ'; ఆలీ 'యమలీల'; నాగార్జున 'బంగార్రాజు' తదితర చిత్రాలు ఆ కోవలోకే వస్తాయి. ఎన్‌టిఆర్, ఎఎన్‌ఆర్, శోభన్‌బాబు, కృష్ణ తదితరులు నటించిన సినిమాల్లో దేవుడి ప్రాధాన్యతలపై కొత్తగా పాత్రలను సృష్టించేవారు. ఇప్పుడు వాళ్లు లేకపోయినా వారి రూపాలతో ఏఐ చిత్రాలు హల్‌చల్ చేస్తున్నాయి.

కల్పిత కథలకు ప్రాణం

కాలాన్ని ప్రామాణికంగా తీసుకుని కొన్ని సినిమాలు వస్తున్నాయి. 'కల్కి 2898' సినిమాలో కథ కాశీ, కాంప్లెక్స్, శంబాలా అనే ప్రపంచాల మధ్య సాగింది. గతంలో బాలకృష్ణ 'ఆదిత్య 369' సినిమా సైంటిఫిక్ మ్యాజికల్‌గా నిలిచింది. 34 ఏళ్ల క్రితం సింగీతం శ్రీనివారావు తెరకెక్కించేవరకు తెలుగులో సైంటిఫిక్ సినిమాలు అంతగా రాలేదు. టైమ్ మిషన్ నేపథ్యంలో వచ్చిన ఈ సినిమా అద్భుత విజయం సాధించింది. 'కల్కి 2898'లో బుజ్జి వాహనం కూడా సరికొత్తగా నిలిచింది. మొదట్లో విఠాలాచార్య దర్శకత్వంలో వచ్చిన అనేక సినిమాలు ఊహకు అందని రీతిలో అనేక జిమ్మిక్కులతో అబ్బురపరిచేవి. అక్కినేని నటించిన 'కీలుగుర్రం', ఎన్టీఆర్ 'భువనసుందరి కథ' నుంచి బాలకృష్ణ 'భైరవ ద్వీపం' వరకూ ఇప్పటి ఏఐకి ధీటుగా నిర్మించినవే. హృతిక్ రోషన్ 'క్రిష్' సినిమా సంచలనం సృష్టించింది. తెలుగులో అద్భుతం, 24, సెవెన్త్‌సెన్స్ సినిమాలు బాగా ప్రజాదరణ పొందాయి. అంతరిక్షం, కార్తికేయ సిరీస్ వంటివి కూడా వచ్చాయి.

క్లాప్ కొట్టకముందు నుంచే...

సినిమాపై హైప్ క్రియేట్ చేసేందుకు చిత్రబృందాలు తెగ శ్రమిస్తున్నాయి. సినిమాకే కాదు.. వాటి ప్రమోషన్లకూ పక్కా స్క్రిప్టులు రాస్తున్నాయి. దీంతో ప్రచారం కొత్త పుంతలు తొక్కుతోంది. అసలా మాటకు వస్తే సినిమా ప్రచారమన్నది విడుదలకు కాస్త ముందు చేసే హంగామా ఎంతమాత్రమూ కాదిప్పుడు. సినిమాకు క్లాప్ కొట్టకముందు నుంచే జనాల నోళ్లలో నానాలి. పేరు పెట్టకముందే వార్తల్లో నిలవాలి. ఈ వ్యూహంతో దర్శక నిర్మాతలు ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. ప్రాజెక్టు ప్రకటన మొదలుకొని ప్రధాన తారాగణం, సాంకేతిక నిపుణుల పేర్లను వెల్లడించడం వరకూ సృజనాత్మకంగా ఆలోచిస్తున్నారు. మొక్కుబడి ప్రకటనలు విడుదల చేయకుండా కాన్సెప్టులు అల్లుకొని మరీ ప్రత్యేక వీడియోలు రూపొందిస్తున్నారు. చిరంజీవి, నయనతారతో దర్శకుడు అనిల్ రావిపూడి ఇలాంటి వీడియోలు చేయించి సామాజిక మాధ్యమాల్లో పెట్టించారు. నాని 30వ చిత్రానికి సంబంధించిన ప్రకటన ఇదే కోవలో సాగింది. బాలకృష్ణ 'అఖండ 2', రామ్‌చరణ్ 'పెద్ది', మహేశ్‌బాబు- రాజమౌళిల కొత్త సినిమా, ఇలా చిన్న, పెద్ద అనే తేడా లేకుండా తాజా సినిమాలన్నింటిలో ఇదే తరహా ప్రచారం ఊపందుకుంది.

లీకులెందుకు?

సినిమాల్లో గ్రాఫిక్స్ ఎంత ఎక్కువగా ఉంటే అంత సినిమా హిట్ అవుతుందనే భావనలో ఇండస్ట్రీలోని వారు కొందరు ఉన్నారు. అందుకే సినిమా షూటింగ్ పూర్తయిన తర్వాత గ్రాఫిక్స్, విఎఫ్ఎక్స్ వర్క్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. కోట్లాది రూపాయలు దీనికి వ్యయం చేస్తున్నారు. ఈ పనుల నిమిత్తం సినిమా మొత్తం ల్యాబ్‌ల్లో ఉంటోంది. ఇక్కడ ఎవరైనా అప్రమత్తంగా లేకపోతే సామాజిక మాధ్యమాల్లోకి వెళ్లిపోతుంది. తాజాగా 'రాజాసాబ్' చిత్రం నుంచి టీజర్ బయటకు వెళ్లిన విషయం తెలిసిందే. గతంలో అత్తారింటికి దారేది, తాజాగా హిట్ 3, అంతకుముందు ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహారాజ్, గేమ్‌ఛేంజర్‌లు లీకులకు గురైనవే. ఒక్కోసారి ఈ లీకుల వ్యవహారం కూడా సినిమా ప్రచారానికి ఉపయోగపడుతోంది. ఏది నిజమో ఏది కాదో తెలియని గందళగోళం కూడా ఇప్పుడు సరికొత్త ప్రచారంలో భాగమే! అంతా సినీ మాయ!

ట్రోఫీ ఆవిష్కరణ వాయిదా

- **విమాన ప్రమాద మృతులకు సంతాపంగా నిర్ణయం**
- **పటౌడీ గౌరవార్థం విజేతకు ఓ మెడల్?**

లండన్ : భారత్, ఇంగ్లాండ్ ఐదు టెస్టుల సిరీస్‌కు టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీగా నామకరణం చేస్తూ ఇటీవల ఇంగ్లాండ్, వేల్స్ క్రికెట్ బోర్డు (ఇసిబి), భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఈ ట్రోఫీని ఇంగ్లాండ్‌లో పటౌడీ ట్రోఫీగా పిలిచేవారు. ఐసిసి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ సందర్భంగా (జూన్ 14న) టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీని ఆవిష్కరించేందుకు ఇసిబి ఏర్పాట్లు చేసింది. సచిన్ టెండూల్కర్, జేమ్స్ అండర్సన్‌లకు ఆహ్వానం పంపడంతో పాటు లార్డ్స్‌లో అట్టహాసంగా కార్యక్రమ నిర్వహణకు రంగం సిద్ధం చేసింది. కానీ, అహ్మదాబాద్ విమాన ప్రమాదం విషాదంతో ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం వాయిదా పడింది. 'భారత్‌లో జరిగిన విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ప్రయాణికుల గౌరవార్థం, సంతాపంగా ట్రోఫీ ఆవిష్కరణ వాయిదా వేశామని ఇసిబి అధికారి ఒకరు తెలిపారు. ట్రోఫీ ఆవిష్కరణకు మరో ముహూర్తం ఖరారు చేస్తామని బిసిసిఐ తెలిపింది. తొలి టెస్టు ఆరంభానికి ముందు ట్రోఫీ ఆవిష్కరణ ఉండవచ్చని సదరు అధికారి వెల్లడించారు.

పటౌడీ వారసత్వం కొనసాగేలా!

భారత్, ఇంగ్లాండ్ ద్వైపాక్షిక టెస్టు సిరీస్‌కు ది టెండూల్కర్-అండర్సన్ పేరును ఎంచుకున్న ఇసిబి, బిసిసిఐ.. భారత క్రికెట్ దిగ్గజం మన్సూర్ అలీ ఖాన్ పటౌడీకి గౌరవం ఇస్తూ, ఆయన వారసత్వం కొనసాగించేందుకు ఆలోచన చేస్తున్నాయి. పటౌడీ ట్రోఫీ పేరు మార్పు చేస్తున్నట్టు ఇసిబి గతంలోనే పటౌడీ కుటుంబానికి (పటౌడీ కుమారుడు బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్)కు తెలియజేసింది. క్రికెట్ లెజెండ్ పటౌడీ పేరిట ఉన్న ట్రోఫీని తొలగించటంపై సచిన్ టెండూల్కర్ తన అభ్యంతరాలను బిసిసిఐ, ఇసిబికి తెలిపినట్టు సమాచారం. దీంతో పటౌడీ వారసత్వం కొనసాగించేలా భారత్, ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో మరో మెడల్‌ను ఇచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. బిసిసిఐ మాజీ కార్యదర్శి, ఐసిసి ఛైర్మన్ జై షా సైతం ఈ అంశంలో ఇసిబితో మాట్లాడినట్టు తెలిసింది. టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీ విజేతగా నిలిచిన జట్టు కెప్టెన్‌కు పటౌడీ మెడల్‌ను ప్రదానం చేయనున్నారు. ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమంలో పటౌడీ మెడల్‌ను సైతం ప్రకటించనున్నారు. 'భారత్, ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో పటౌడీ పేరును కొనసాగించేందుకు ఓ ప్రణాళిక రూపొందిస్తున్నాం. చాంపియన్‌గా నిలిచిన జట్టు కెప్టెన్‌కు పటౌడీ మెడల్‌ను అందించబోతున్నామని ఇసిబి అధికారి ఒకరు తెలిపారు.

సారథ్యానికి గిల్ సిద్ధమే

- **జట్టును నడిపించటం అతడికి తెలుసు**
- **భారత స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్**

లండన్ (ఇంగ్లాండ్) : భారత్ టెస్టు క్రికెట్ ఆడి ఐదు నెలలైంది. ఈ స్వల్ప సమయంలో డ్రెస్సింగ్ గ్రూమ్‌లో ఎంతో మార్పు వచ్చింది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్ టెస్టు క్రికెట్‌కు దూరమయ్యారు. కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇంగ్లాండ్ పర్యటనలో తొలి పరీక్షకు సిద్ధమవుతున్నాడు. ఈ నేపథ్యంలో భారత స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీకి సిద్ధంగా ఉన్నాడని అభిప్రాయపడ్డాడు. 'ఓ జట్టును ఎలా ముందుండి నడిపించాలో శుభ్‌మన్‌కు బాగా తెలుసు. కొన్నేళ్లుగా సీనియర్ల దగ్గర గిల్ నేర్చుకున్నాడు. గత ఏడాది రోహిత్ శర్మతో శుభ్‌మన్ గిల్ సుదీర్ఘ సంభాషణలు టెస్టుల్లోనే కాదు వన్డేల్లోనూ చూశాం. సీనియర్ల నుంచి అతడు ఎంతో నేర్చుకున్నాడని అనుకుంటున్నాను. ఓ నాయకుడిగా శుభ్‌మన్ గిల్ ఎంతో ఉత్సాహంగా కనిపిస్తున్నాడు. డ్రెస్సింగ్ గ్రూమ్ వాతావరణం మెరుగుపర్చేందుకు తపన పడుతున్నాడు. భారత క్రికెట్ లీడర్‌షిప్ గ్రూప్‌లో చూసిన నాయకత్వ లక్షణాలు.. గత 3-4 సీజన్లలో శుభ్‌మన్ గిల్‌లో గమనించాను. భారత్‌కు సారథ్యం వహించేందుకు శుభ్‌మన్ గిల్ సిద్ధంగా ఉన్నాడు' అని కుల్‌దీప్ యాదవ్ అన్నాడు.

రోహిత్ స్థానం ఎప్పటికీ తీసుకోను

టీమ్ బస్‌లో రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా పక్కన కూర్చుంటారు. రోహిత్ వీడ్కోలుతో జడేజా పక్కన ఇప్పుడు కుల్‌దీప్ కూర్చుంటున్నాడు. రోహిత్ స్థానం తీసుకోవటంపై మీడియా అడిగిన ప్రశ్నకు కులీదీప్ యాదవ్ ఈ విధంగా బదులిచ్చాడు. 'రోహిత్ శర్మ స్థానం ఎప్పటికీ తీసుకోలేను. జడేజాతో సమయం గడిపేందుకు మాత్రమే ఆయన పక్కన కూర్చుంటున్నాను. అశ్విన్ సైతం వీడ్కోలు పలికాడు. జడేజా నుంచి నేర్చుకునేందుకు ఎదురుచూస్తున్నాని' కుల్‌దీప్ తెలిపాడు.

ఆరంభ మ్యాచ్ 0-0తో డ్రా

మయామి (యుఎస్‌ఏ) : ఫిఫా 2025 క్లబ్ ప్రపంచకప్ ఆరంభ మ్యాచ్ గోల్ లేని డ్రాగా ముగిసింది. ఇంటర్ మయామి, అల్ అహ్లీ తలపడిన తొలి మ్యాచ్‌లో లియోనల్ మెస్సి, లూయిస్ స్వారేజ్ చెమటోడ్చినా.. ఆతిథ్య ఇంటర్ మయామి గోల్ కొట్టలేకపోయింది. 56 శాతం బంతిని నియంత్రణలో ఉంచుకున్నా మెస్సీ సేనకు నిరాశ తప్పలేదు. ఈజిప్ట్ క్లబ్ అల్ అహ్లీ పాస్‌ల కచ్చితత్వం సహా గోల్‌పోస్ట్‌పై దాడిలో మెస్సీ జట్టుపై పైచేయి సాధించింది. 90 నిమిషాల ఆట తర్వాత ఇరు జట్లు గోల్ చేయటంలో విఫలం అయ్యాయి. 0-0 డ్రాతో ఇరు జట్లు చెరో పాయింట్ పంచుకున్నాయి.

ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్..

- **కోచ్‌గా వివిఎస్ లక్ష్మణ్ !**

లండన్ : ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌కు టీమ్ ఇండియా సిద్ధమవుతోంది. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో.. కొత్త సారథి శుభ్‌మన్ గిల్ నేతృత్వం వహిస్తుండటంతో ఈ సిరీస్‌పై ఆసక్తి నెలకొంది. కొన్ని మ్యాచ్‌లకు ప్రధాన కోచ్ గంభీర్ అందుబాటులో ఉండే పరిస్థితులు కనిపించడం లేదు. తన తల్లి ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో అతడు ఇంగ్లాండ్ నుంచి తిరుగు పయన మయ్యాడు. కోచ్ బాధ్యతలను నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సిఏ) ఛైర్మన్ వివిఎస్ లక్ష్మణ్ చేపట్టనున్నట్లు సమాచారం. అండర్-19 జట్టు ఇంగ్లాండ్ పర్యటనలో భాగంగా లండన్‌లోనే ఉన్న లక్ష్మణ్ గంభీర్ తిరిగి వచ్చేవరకు టీమిండియాకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68